

- యుద్ధ నౌక నేడు జాతికి అంకితం
- విశాఖలో ప్రారంభించనున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఉదయగిరి దుర్గానికి చారిత్రక గుర్తింపు

ఉదయగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహోన్నత గిరులతో శత్రుదుర్భేద్యంగా ఉన్న ఉదయగిరి చారిత్రక దుర్గానికి గౌరవ చిహ్నంగా ఐఎన్ఎస్ ఉదయగిరి పేరుతో వికసిత భారత్‌లో భాగంగా స్వీయ సాంకేతికతతో తయారు చేసిన యుద్ధనౌకను మంగళవారం జాతికి అంకితం చేయనున్నారు. ఉదయగిరి దుర్గం అడవుల్లో సంచరించే వన్యప్రాణి లోగో యుద్ధనౌకపై చిత్రీకరించారు. విశాఖలోని తూర్పు నౌకాదళ ముఖ్య కేంద్రమైన డాక్ యార్డులో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠిల చేతుల మీదుగా ఉదయగిరితోపాటు హిమగిరి యుద్ధనౌకను జలప్రవేశం చేయనున్నారు. ఇండో పసిఫిక్, చైనా ప్రాంత సరిహద్దుల్లో చేపడుతున్న వ్యూహాత్మక రక్షణ ప్రాజెక్టు పనుల్లో భాగంగా సీ-17 పేరిట స్వీయ సాంకేతికత, ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలతో కోల్‌కతా, ముంబయిలలో ఈ యుద్ధనౌకలను భారత రక్షణ వ్యవస్థ నిర్మించింది.

ప్రత్యేకతలివీ..

6,670 టన్నుల బరువు, 28 నాటికల్స్ మైళ్ల వేగం, ఆధునిక సెన్సార్ వ్యవస్థ ఈ నౌకల సొంతం. ఈ నౌకల నుంచి సూపర్ సోనిక్, బ్రహ్మోస్ వంటి అస్త్రాలను నింగిలోని లక్ష్యాలకు ప్రయోగించవచ్చు. ఈ నౌకల పొడవు దాదాపు 149 మీటర్లు. భీకరపోరు సాగించే ఆధునిక ప్రత్యేకతలు ఈ యుద్ధనౌకలకు ఉన్నాయి.

యూడీఎఫ్ హర్షం

చారిత్రాత్మక ప్రదేశమైన ఉదయగిరిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారత యుద్ధనౌకకు ఉదయగిరి పేరు పెట్టడం హర్షణీయమని ఉదయగిరి డెవలప్‌మెంట్ ఫోరం (యూడీఎఫ్) వ్యవస్థాపకులు షేక్‌ఎండీ ఖాజా, వీఎస్ఆర్ మూర్తిలు ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఎంతో చరిత్ర కలిగిన ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు.



డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీలో విజయం సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడింది. సోమవారం నిర్వహించాల్సిన ఈ ప్రక్రియను రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు డీఈవో ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు, డీటీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఎస్ఐ కోఆర్డినేటర్లకు ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలనకు సంబంధించి శిక్షణ ఇచ్చి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. త్వరలో నూతన తేదీలను అభ్యర్థులకు మొబైల్ నెంబరుకు మెసేజ్ రూపంలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

భద్రంగా ఉండండి.. బాధ్యతగా మెలగండి!

'చవితి' ఉత్సవ నిర్వాహకులకు అధికారుల సూచనలు

ఆత్మకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో వేడుకగా నిర్వహించేందుకు జిల్లావాసులు సిద్ధమవుతున్నారు. వీధులు, కాలనీలు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు ఇలా అనేక రంగాలకు చెందిన వారు చందాలు వేసుకుని ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే వివిధ ఆకృతులలో మండపాలను తీర్చిదిద్దగా, రంగురంగుల విద్యుద్దీపాలతో కూడళ్లను అలంకరిస్తున్నారు. ముందస్తుగానే గణనాథుల ప్రతిమలను మండపాలకు చేర్చుతున్నారు. ఇంత వేడుకగా జరుపుకుంటున్న ఉత్సవాలకు అనుమతులు తీసుకోవాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు. పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. నిర్వాహకులు చేసుకున్న దరఖాస్తులను పూర్తిగా పరిశీలించాకే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ముందుగా మున్సిపల్, పంచాయతీ, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు పొందిన పత్రాలతో పాటు అర్జీని అందించాల్సి ఉంటుంది.



వేదాయపాళెం సెంటర్‌లో

పాటించాల్సిన నియమాలు...

- చలువ పందిళ్ల ఏర్పాటుకు, ఊరేగింపులకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలి.
- ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక అధికారిని మిగత శాఖలు, మండపాల నిర్వహణ కమిటీలతో సమన్వయకర్తగా నియమిస్తారు. నిర్వాహకులకు ఏదైనా సమస్య లేదా సందేహాల నివృత్తికి సమన్వయ అధికారిని లేదా ఆయా పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలి.
- మండపాల వద్ద పగలు 55, రాత్రి 45 డెసిబుల్స్ మించకుండా బాక్సు టైప్ స్పీకర్లను వినియోగించాలి. సాయంత్రం 6 నుంచి రాత్రి 10గంటల వరకు లౌడ్ స్పీకర్లను వినియోగించకూడదు.
- ప్రతిమల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం తేదీ, నిమజ్జన మార్గం, వాహనాల వివరాలు తెలియజేయాలి. బాక్సుటైప్ స్పీకర్ల వినియోగం గురించి తెలియజేయాలి.
- భద్రత కోసం రాత్రి వేళల్లో మండపాల వద్ద నిర్వాహకుల ప్రతినిధులు కాపలా ఉండాలి.
- అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. పూజా సమయంలో మండపంపై ఎక్కువ మంది జనం లేకుండా చూసుకోవాలి. పందిళ్లకు దూరంగా వాహనాలు ఆపుకోవాలి.
- రోడ్డుపై వినాయక పందిళ్లు వేయకూడదు. ట్రాఫిక్‌కు ఏవిధమైన ఇబ్బందులు కలిగించకూడదు. బ్యానర్లు, ఫ్లెక్సీలు రోడ్లపై పెట్టకూడదు.
- ఊరేగింపు సమయంలో ఇతర కులాలు, మతాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం, ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించకూడదు. మతసామరస్యం పాటించాలి.
- మండపాల పరిసరాల్లో అనుమానిత వ్యక్తుల సంచారం, కొత్త వస్తువులు వదిలివేసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలి.
- షార్ట్ సర్క్యూట్‌లకు ఆస్కారం లేకుండా వైరింగ్ జాగ్రత్తగా చేయించుకోవాలి. నిమజ్జన సమయంలో రంగులు చల్లడం, బాణసంచా కాల్చడం చేయరాదు.
- ఊరేగింపు సమయంలో కర్రలు, ఇతర ఆయుధాలు ధరించి పాల్గొనరాదు. ప్రదర్శన చూపిన సమయం, రూటు తప్పనిసరిగా పాటించాలి.
- ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఇందుకు అర్జీదారుడు లేదా కార్యనిర్వహకులదే బాధ్యత.

అనుమతులకు సింగల్ విండో విధానం : ఎస్పీ

నెల్లూరు (క్రైం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గణేష్ ఉత్సవ అనుమతులను సులభతరం చేస్తూ ప్రభుత్వం సింగల్ విండో విధానాన్ని అమలు చేస్తోందని ఎస్పీ జి కృష్ణ కాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవ నిర్వాహకులు ganeshutsav.net వెబ్ సైట్‌లో వివరాలను పూర్తి చేసి అనుమతులు పొందవచ్చని తెలిపారు. వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు పొందుపరిచాక ఆ ప్రాంత పోలీసు అధికారి ఇతర శాఖల అధికారులతో కలిసి మండపం ప్రాంగణాన్ని పరిశీలించి సానుకూలంగా ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌వోసీని జారీ చేయనున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్‌ను ల్యామినేషన్ చేసి ఉత్సవ పందిరిలో తనిఖీలకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఉత్సవాలను నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని వీలైనంత వరకు మట్టి గణేష్ ప్రతిమలను ప్రతిష్ఠించాలని కోరారు. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని, అశ్లీల నృత్యాలు నిర్వహించరాదని, ఎలాంటి బలవంతపు వసూళ్లకు పాల్పడరాదని సూచించారు.



నెల్లూరు : గాంధీబొమ్మ కూడలిలో రాజమహల్ ఆకృతిలో..



ఆత్మకూరు: కొలువుదీరేందుకు తరలుతున్న గణనాథుడు

భూముల ధరలకు రెక్కలు

- హైవేతో పెరిగిన డిమాండ్
- అయినా దొరకని పొలాలు

అనంతసాగరం ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : 565 నెంబర్ జాతీయ రహదారి వినియోగంలోకి రావడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. తెలంగాణలోని నకిరేకల్ నుంచి తిరుపతి జిల్లా ఏర్పేడు వరకు 545 కి.మీ పొడవున ఈ హైవే విస్తరించి ఉంది. నెల్లూరు-ముంబాయితో రహదారితో అనుసంధానం చేస్తూ ఏర్పేడు సమీపంలో 71వ జాతీయ రహదారిలో (నాయుడుపేట-పూత లపట్టు) కలుస్తోంది. ఈ రహదారి పుణ్యమా అని పామూరు, కలిగిరి, మర్రిపాడు, అనంతసాగరం, రాపూరు, డక్కిలి, వెంకటగిరి ప్రాంతాల్లోని భూముల ధరలు రెట్టింపు అయ్యాయి. రోడ్డు వినియోగంతో వాణిజ్య రవాణా మెరుగుపడింది. రైతులు పండించిన ఉత్పత్తులు పట్టణాలకు తరలించే వేసులుబాటు కూడా కలిగింది. ఇక హైవే పక్కన భూములు అమ్మకానికి దొరకని పరిస్థితి కనిపిస్తోంది. విస్తరణకు ముందు ఎకరం రూ.5-7 లక్షలు ఉండగా ప్రస్తుతం రూ-10-20 లక్షల వరకూ ధర పలుకుతోంది. డిమాండ్ పెరగడంతో రోడ్డు వెంబడి భూములు కలిగిన రైతులు ఆనందంగా ఉన్నారు. మరోవైపు చెన్నై, తిరుపతి, పెంచలకోన, కడప, రాజంపేట, తదితర ప్రాంతాలకు వెళ్లేవారికి మెరుగైన రవాణా సౌకర్యం కలగడం, తక్కువ సమయంతో ప్రయాణ ఇబ్బందులు తీరాయి.



రోడ్డు వెంబడి పొలాలు

నేడు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

- జిల్లా అధ్యక్షుడి ఎన్నికకు అభిప్రాయ సేకరణ
- హాజరు కానున్న ముగ్గురు మంత్రులు

నెల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం జరగనుంది. నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, అనుబంధ సంఘాల ఎంపికపై అభిప్రాయ సేకరణ జరుగుతుంది. ఇందుకోసం టీడీపీ అధిష్ఠానం త్రీమెన్ కమిటీని నియమించింది. ఈ కమిటీలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ ఉన్నారు. మంత్రి సత్యప్రసాద్ సోమవారం రాత్రే నెల్లూరుకు చేరుకోగా, మిగిలిన ఇద్దరు సభ్యులు మంగళవారం ఉదయం నెల్లూరుకు చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ విస్తృత స్థాయి సమావేశంలో జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలతోపాటు ముఖ్య నేతలు, మండల పార్టీ అధ్యక్షులు పాల్గొంటారు. ముందుగా జిల్లాలోని పరిస్థితులపై చర్చిస్తారు. అనంతరం అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటారు. ఈ ప్రతిపాదనలపై ముఖ్య నేతలందరి అభిప్రాయాన్ని త్రీమెన్ కమిటీ సభ్యులు తీసుకుంటారు. జిల్లా అధ్యక్ష పదవికి సంబంధించి ముగ్గురి పేర్లతో కూడిన నివేదికను పార్టీ అధిష్ఠానానికి అందిస్తారు. అధ్యక్షుడితోపాటు ప్రధాన కార్యదర్శి, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులకు సంబంధించి కూడా అభిప్రాయ సేకరణ జరుగుతుంది. త్రీమెన్ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తుది నిర్ణయం తీసుకుంటారు. కాగా జిల్లాకు విచ్చేసిన మంత్రి సత్యప్రసాద్‌ను పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఓ ఆనంద్, జేసీ కే కార్తీక్, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న కలెక్టర్ ఆనంద్

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సోమవారం ప్రారంభమైంది. నియోజకవర్గ స్థాయిలో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి లబ్ధిదారులకు కార్డులను పంచిపెట్టారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరులో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోవూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. జిల్లాకు 7,10,990 రేషన్‌కార్డులు కాగా, వీటిని తహసీల్దార్ల పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగి రేషన్ డీలర్‌తో కలిసి అందచేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఇంటింటికి వెళ్లి ఈ కార్డులను పంచిపెడతారు. మిగిలిన కార్డులను సెప్టెంబరు 15వ తేదీ వరకు రేషన్ షాపులలో లబ్ధిదారులకు అందచేస్తారు.



ముత్తుకూరులో స్మార్ట్‌కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, డీఎస్వో విజయకుమార్

వెహికల్ ఫిట్‌నెస్‌లో పారదర్శకత

ముత్తుకూరు,(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాహనాల ఫిటెనెస్‌లో పారదర్శకతను పాటించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కప్పలదొరువు వద్ద సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డితో కలిసి ప్రణీత్ ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఇక్కడ దీన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.ఈ కార్యక్రమంలో ఏటీఎస్ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మల్లికార్జునయాదవ్, సన్నారెడ్డి సురేష్ రెడ్డి, ఈదూరు ప్రదీప్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రమేష్‌శర్మ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9589
వెండి కిలో ధర	రూ. 119500
వెండి ఒక గ్రాము	రూ. 122.50



వరిపైరు పొట్ట, కంకి దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● మండల వ్యవసాయాధికారి డీ. రఘునాథరెడ్డి

ఇందుకూరుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వరి పైరులో పొట్ట, కంకి దశలో ఆశించే చీడపీడలను సకాలంలో వ్యవసాయ శాఖ వారు సిఫార్సు చేసిన పురుగు మందులను పిచికారీ చేసి నివారించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి డీ. రఘునాథరెడ్డి తెలిపారు.

? : వరిపైరులో కరుకు దశలో వచ్చే చీడపీడల గురించి తెలపండి.

! : వరిపైరులో కరుకు దశలో పాము పొడ, పొట్టకుళ్లు తెగుళ్లు ఆశిస్తాయి. నివారణకు ప్రొపెనోఫాస్ (టిల్ట్) 1మిల్లీ/1లీటర్ నీటికి లేక హెక్సాకోనోజోల్ (కాంజోల్) 2మి.లీ/1లీటర్ నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి.

? : వరిలో కంకి పాలు పోసుకునే దశలో వచ్చే ఇబ్బందులు.

! : ఎడగారు వరిలో గింజ పాలు పోసుకునే దశలో కంకి నల్లి నష్టపరుస్తుంది. నివారణకు ప్రాపర్గైట్ (ఒమైట్)2మిల్లీ/1లీటర్ నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి.

? : ఎడగారు వరికోతకు ఎన్ని రోజులు ముందు పొలాన్ని ఆరబెట్టుకోవాలి.

! : కోతలకు 15రోజులు ముందు పొలాన్ని ఆరబెట్టుకోవాలి.

? : ఎడగారి వరిలో గింజ నల్ల నొక్కు నివారణ గురించి తెలపండి.

! : ఎడగారు వరిలో గింజ నల్లనొక్కు నివారణకు ప్రొపెకోనోజోల్ 1మిల్లీ/1లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కామాక్షితాయికి పెద్ద వెండి నందిసేవ



బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జొన్నవాడ ఆలయంలో సోమవారం రాత్రి మల్లికార్జున స్వామి, కామాక్షితాయికి పెద్ద వెండి నందివాహనసేవ నిర్వహించారు. స్వామి,అమ్మవార్లు గ్రామోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.స్వామి,అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. శివయ్య, అనసూయ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పాఠశాల తనిఖీ

మనుబోలు, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుడితిపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఇన్‌చార్జి ఎంఈవో జే, ఓబులు, ఎంఈవో-2 రమేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు.

రాష్ట్ర యోగా పోటీల్లో 'చెలికం'కు నాలుగో స్థానం

మనుబోలు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో మనుబోలుకు చెందిన చెలికం కోటీశ్వరరెడ్డి నాలుగో స్థానంలో నిలిచారు. తాడేపల్లిగూడెం పత్తిపాడులో ఈనెల 21నుంచి 24వరకు జరిగిన రాష్ట్ర స్థాయి 6వ యోగాసాన పోటీల్లో సీనియర్ బీ విభాగంలో కోటీశ్వరరెడ్డి నాలుగో స్థానం దక్కించుకున్నారు. దీంతో ఆయనకు స్పోర్ట్స్ అసోసియేషన్ పరిశీలకుడు నందన్, వైఎస్ ఏపీ ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ప్రశంసా పత్రం అందచేశారు.

ధర్మకర్తల ప్రమాణ స్వీకారం

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరమడుగు శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం ధర్మకర్తల ప్రమాణ స్వీకారం జరిగింది. కమిటీ చైర్మన్‌గా పూండ్ల శ్రీనివాసులురెడ్డి, సభ్యులుగా కందుకూరి రాము, మురిగం మాలకొండయ్య, కోర్నా ఆశాలత, చేజర్ల సుభాషిణి, గోళ్ల జమునారాణి, ఓజిలి సునీత, వల్లూరి శర్మ, ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముంబాయి జాతీయ రహదారిపైన సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. నెల్లూరు నుంచి వస్తున్న కారు బుచ్చికి చేరుకోగానే టైరు పగలడంతో డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం దెబ్బతినగా ఎయిర్‌బ్యాగ్‌లు తెరచుకున్నాయి. అయినా కారులో ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పరిశీలించి గాయపడిన వ్యక్తి బుచ్చికి చెందిన వేణుగా గుర్తించి, చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ సంతోష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాపారంగా గణేశ్ ప్రతిమల తయారీ

● ఎందరికో జీవనాధారం ● రూ.3వేల నుంచి రూ.35 వేల వరకు విగ్రహాల ధర ● ఆకట్టుకున్న ఆఫర్లు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే పలువురు యువకులు గణేశ్ విగ్రహాల తయారీతో జీవనోపాధికి బాటలు వేసుకున్నారు మరికొందరు గణేశ్ విగ్రహాల తయారీయే జీవనాధారంగా చేసుకున్నారు. ఇంకొందరు మారుబేరాలతో సీజనల్ వ్యాపారంగా మలుచుకున్నారు. ప్రస్తుతం బుచ్చి జాతీయ రహదారి వెంబడి చెల్లాయపాళెం రోడ్డు దగ్గర్నుంచి టోల్‌గేట్ సమీపం వరకు పలుచోట్ల సుమారు 1500 మేర గణేష్ విగ్రహాలను సిద్ధ చేశారు. అయితే ధరలు చూస్తే రూ.3వేల నుంచి రూ. 35వేలకు పైమాటే. వినాయకచవితికి నాలుగైదు నెలలు ముందు నుంచే బుచ్చి, ఇనమడుగు, గండవరం, నెల్లూరుతోపాటు జిల్లా నలుమూలలల్లో అనువైన ప్రాంతాల్లో గణేశ్ విగ్రహాలు తయారు చేయిస్తారు. ఆ విగ్రహాలను వినాయకచవితికి 10రోజుల ముందునుంచి బుచ్చిలోని ప్రధాన మార్గాల వెంబడి కొలువుదీర్చి అమ్ముకుని సొమ్ము చేసుకుంటారు. విగ్రహాల తయారీ కోసం ముందుగా గణేశ్ విగ్రహాలకు అచ్చులు పోసేవాళ్లు, రకరకాల ఆకృతులతో విగ్రహాలు తయారీ చేసేవాళ్లు, రంగులతో తీర్చిదిద్దేవాళ్లు, ఇలా ఎంతోమంది చేతల కష్టంతో తయారు చేసే ఆ విగ్రహాల్లో సాక్షాత్తు ఆ గణనాథుడు కొలువుతీరిఉంటారు.



వినాయక విగ్రహాలు కొనుగోలు చేస్తున్న యువత

● బంపర్ ఆఫర్లు

అక్కడ గణేశ్ విగ్రహాలు కొన్నవారికి లక్కీడ్రాలో ముగ్గురికి 3 గణేశ్ విగ్రహాలు ఉచితంతోపాటు రెండు నగదు బహుమతులు ప్రకటించారు. దీంతో విగ్రహాల తయారీదారులు పెట్టిన ఆఫర్లకు సోమవారం జిల్లా నలు మూలల నుంచి భారీగా యువకులు బుచ్చికి చేరుకున్నారు. హైవే పక్కన శ్రీ విఘ్నేశ్వర శిల్పాకళా ఆర్ట్స్ మనోజ్ ఈ ఆఫర్ ప్రకటించారు.

మండపానికో క్యూఆర్ కోడ్

పొదలకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి వేడుకల సమయంలో విషాద ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుశాఖ ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. గణపతి ఉత్సవాల నిర్వహణకు నిబంధనలు కట్టుదిట్టం చేసింది. తొలిసారి కొత్తగా క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. విధి విధానాలను స్థానిక ఎస్ఐ హనీఫ్ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. కమిటీలదే పూర్తి బాధ్యత అని, మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా కమిటీ సభ్యులే పూర్తి బాధ్యత వహించాలని తెలిపారు. ఉత్సవాల ముసుగులో ఘర్షణలు, మత కలహాలు, అల్లర్లకు పాల్పడినా, నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

పొదలకూరులో గణేశుడు చాలా ఖరీదయ్యా!

పొదలకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో విగ్రహాల కొనుగోళ్లతో వినాయక చవితి సందడి మొదలైంది. ఊరూవాడా బొజ్జ గణపయ్య విగ్రహాలు, పందిళ్ల ఏర్పాటుతో యువత కోలాహలం చేస్తోంది. పట్టణంలో ఎటుచూసినా అడుగు నుంచి పది అడుగుల ఎత్తు గణేశ్ విగ్రహాల విక్రయాలు ఊపందుకున్నాయి. విగ్రహాల కొనుగోళ్లు ఈసారి ఎక్కువగానే ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. విగ్రహాల ఖరీదు రూ.7వేల నుంచి రూ.30వేల మధ్య ధర ఆకాశాన్నంటుతోంది. 5 అడుగుల నుంచి 10 అడుగుల ఎత్తున్నవి, ఆకృతిని బట్టి ధర పలుకుతున్నాయి. అది కూడా ప్రాంతాన్ని బట్టి తేడాలుండడం గమనార్హం. కొన్నిచోట్ల మూడు అడుగుల విగ్రహాలను రూ.5వేలకు విక్రయిస్తున్నారు. అడుగు ఎత్తుతో మట్టితో చేసినవి అలంకరణను బట్టి రూ.1,500 వరకు ధర పలుకుతోంది. ఇంకాస్త చిన్నవాటిని రూ.900 నుంచి రూ.వెయ్యి మధ్యలో విక్రయిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పర్యావరణహితం కాదని ప్రకృతి ప్రేమికులు చెబుతున్నా.. కొనుగోళ్లు మాత్రం తగ్గడంలేదు. ఇటీవల వర్షాల కారణంగా విగ్రహాలు తడిసిపోయి వ్యాపారాలు కొంత ఆందోళనకు గురైనా, వెంటనే తేరుకున్నారు. సాధారణంగా వినాయక చవిదతి ముందురోజు విగ్రహాల విక్రయాలు ఎక్కువగా జరుగుతుంటాయని, ఈసారి పండుగ బుధవారం రావడం, ముందురోజు మంగళవారం కావడంతో ఆదివారానికే సగం విక్రయాలు పూర్తయ్యాయి.

స్మార్ట్ రేషన్ కార్డులతో సరుకుల పంపిణీలో పారదర్శకత : సోమిరెడ్డి

ముత్తుకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్ కార్డులతో సరుకుల పంపిణీలో పారదర్శకత వస్తుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విజయ్‌కుమార్, మండల టీడీపీ నాయకులు నీలం మల్లికార్జునయాదవ్, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఈదూరు ప్రదీప్ రెడ్డి, రాగాల శివకృష్ణ, బొలిగర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మనుబోలులో మహిళకు స్మార్ట్ రైస్ కార్డు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్, టీడీపీ నాయకులు



కోవూరులో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న వేమిరెడ్డి దంపతులు

● కోవూరు : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ కార్డుల పంపిణీలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. పీఆర్ ఆర్ కాలనీకి చెందిన పలువురు వినియోగదారులకు వారు స్మార్ట్ రేషన్ కార్డుల్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● విడవలూరు : గ్రామంలో సోమవారం ఈస్టర్న్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దారు చంద్రశేఖర్‌తో కలసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ అబ్దుల్ సలాం, టీడీపీ నాయకులు సత్యవోలు సత్యంరెడ్డి పాల్గొన్నారు.

● మనుబోలు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీని రెవెన్యూ అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, డీటీప్రదీప్,ఆర్ఐ అరుణ్‌బాబు, వీఆర్వో నాగార్జునరెడ్డి, కేసీ వీసీ చైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు, నాయకులు కిరణ్, సాని వెంకటరమణయ్య, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

● పొదలకూరు : మండలానికి వచ్చిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దారు కార్యాలయంలో సోమవారం డీటీ సురేఖ, సివిల్ సప్లై డీటీ ఐ.రవి, టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, ఇతర నాయకులు బక్కయ్యనాయుడు, కండే నరసయ్య పంపిణీ చేశారు. మండలంలో చౌక దుకాణాలు, 59 ఉండగా, రేషన్‌కార్డులు 21252 ఉన్నాయి.

●బుచ్చిరెడ్డిపాళెం : స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీని సోమ వా రం పట్టణంలోని 2వ నెంబరు రేషన్ దుకాణం పరిధిలో తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, అర్బన్ టీడీపీ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, సివిల్ సప్లైస్ అధికారి మల్లికార్జున తదితరుల అధ్వర్యంలో ప్రారంభించారు.

దోమల నివారణకు చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి) : బుచ్చి నగర పంచాయ తీలోని 7వవార్డు పరిధిలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళీ, వైస్ చైర్మన్ నస్రీన్‌ఖాన్, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు సోమవారం దోమల నివారణ కు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జమీలామహల్ వెనుక ప్రాం తంలోని గుడపల్లి కాలువలో ఆయిల్ బాల్స్ వదిలారు. మురుగు కాలు వల్లో వ్యర్థ పదార్థాలు వేసి మురుగునీటి ప్రవాహానికి అంతరాయం కలిగించవద్దని కాలువ వెంబడి ప్రజలను వారు కోరారు. వ్యర్థాలను ప్రతి ఒక్కరూ డస్ట్‌బిన్లలో వేయాలన్నారు.

● కుక్కల బెడదను నివారించండి

నగర పంచాయతీలో కొన్ని నెలలుగా కుక్కల బెడద తీవ్రమైందని, నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని క్లస్టర్ ఇన్‌చార్జ్ వింజం రామానాయుడు చైర్‌పర్సన్‌ను కోరారు. స్పందించిన చైర్‌పర్సన్ ఈ సమస్యను నెలాఖరులో జరిగే కౌన్సిల్‌లో పెట్టి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రహమత్, టీడీపీ మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్షుడు సందానీ, నాయకులు అక్తర్, అల్తాఫ్, హనీఫ్ పఠాన్, మహబూబ్‌బాష పాల్గొన్నారు.

డీఎస్సీలో ద్వివర్ణలక్ష్మి ప్రతిభ



● నాలుగు విభాగాల్లో ఉత్తీర్ణత

విడవలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల అయిన డీఎస్సీ ఫలితాల్లో సచివాలయ ఉద్యోగి ద్వివర్ణలక్ష్మి నాలుగు విభాగాల్లో ఉత్తీర్ణత సాధించి తన ప్రతిభను చాటుకుంది. అలగానిపాడుకి చెందిన దాసరి వెంకట కృష్ణమ్మ రాజు, విజయలక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. చివరి సంతానం అయిన ద్వివర్ణలక్ష్మి మొదటి నుంచి విద్యపై మక్కువ చూపేది. ఆమెకు వివాహం అయిన తరువాత 2019లో సచివాలయ కార్యదర్శిగా వెంకటగిరి మండలానికి వెళ్లారు. ఉద్యోగం వచ్చింది కదా... అని విశ్రాంతిగా ఉండక, డీఎస్సీ పరీక్ష రాసింది. ఆ పరీక్షల్లో ఒకేసారి ఎస్ఏ ఇంగ్లీష్, ప్రిన్సిపాల్ స్టేట్, పీజీటీ ఇంగ్లీష్ (జోన్-3),టీజీటీ ఇంగ్లీష్, జోన్-3లో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భర్త చంద్రయ్య ప్రోత్సాహంతో ఈ విజయం సాధించానన్నారు.

టీడీపీలో చేరిన 13 కుటుంబాలు

మనుబోలు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరంపల్లిలో వైసీపీ ముఖ్యనాయకులంతా సోమవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో నెల్లూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీలో చేరారు. మాజీ ఎంపీటీసీ తురిమెర్ల రఘురామిరెడ్డి, ప్రస్తుత ఎంపీటీసీ తాటిపర్తి రాఘయ్య, వార్డు సభ్యులు పలగాని శేషురెడ్డిలతోపాటు 13 కుటుంబాలవారు, వారి అనుచరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే సోమిరెడ్డి కండువాలు కప్పి స్వాగతించారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి

ముత్తుకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ సీనియర్ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ కమిటీ సభ్యులు ఏడుకొండలు, కార్యదర్శి ఎస్‌కె.ముబీజ్‌బాషా, ప్రవీణ్, షణ్ముఖం, ప్రసాద్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు ఎస్ఐగా ప్రసాద్‌రెడ్డి

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి) : ఎస్ఐగా ప్రసాద్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ముత్తుకూరు మండలంలో ట్రాఫిక్, ఇతర సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు.

కోఆర్డినేటర్‌గా నజీర్ : వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లికి చెందిన షేక్ నజీర్‌ను దూదేకుల కేర్ ఫోర్స్ (డీసీఎఫ్) మండల కోఆర్డినేటర్‌గా డీసీఎఫ్ సంస్థ నియమించింది. సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులు, నజీర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, వాగ్దానాలు నెరవేర్చుతున్న

చంద్రబాబు నాయుడు : ఎంపీ వీపీఆర్

కోవూరు, ఆగస్టు 24,(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా సీఎం చంద్రబాబు ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తున్నారని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటైన 'స్త్రీ శక్తి' సభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాల్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణాల పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఎంతమంది సంతానం ఉన్నా తల్లికి వందనం అమలు చేస్తున్నారని చెప్పారు.ప్రతీ నెల ఒకటో తేదీన రూ.4000 పింఛన్ అందిస్తున్నామన్నారు. ప్రతీ పేద కుటుంబానికీ ఉచితంగా మూడు సిలిండర్లను పంపిణీ చేస్తుండటం అభినందనీయమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ మహిళలకు ఆర్థిక చేయూత అందించాలనే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్త్రీశక్తి కార్యక్రమం లోకేశ్ ఆలోచనల నుంచే పుట్టిందన్నారు. సభానంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన పలువురు మహిళలను వేమిరెడ్డి దంపతులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ టీ. పార్వతి, బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కోవూరు,వేగూరు సర్పంచులు యాకసిరి విజయమ్మ, అమరావతి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

జొన్నవాడ సబ్‌స్టేషన్ లైన్‌మన్ చేతివాటం

దళితుల వద్ద రూ. వేలు స్వాహా ● ఏఈ పరిశీలనలో వెల్లడి

విడవలూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విడవలూరు సబ్‌స్టేషన్‌లో అసిస్టెంట్ లైన్‌మన్‌గా పనిచేసి, బుచ్చి మండలం జొన్నవాడ లైన్‌మన్‌గా బదిలీపై వెళ్లిన చంద్రశేఖర్ అవినీతి, అక్రమాలు సోమవారం ఆశాఖ ఏఈ విజయలక్ష్మి తనిఖీల్లో వెలుగుచూశాయి. అలాగే గతంలో విడవలూరుకి చెందిన విజీల్ అనే లైన్‌మన్ విద్యుత్ బిల్లులు వసూలు చేసి స్వాహా చేశాడు. అతడిపై కూడా వినియోగదారులు ఫిర్యాదు చేశారు. అయినా కూడా విద్యుత్ ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. జొన్నవాడ అసిస్టెంట్ లైన్‌మన్ చంద్రశేఖర్ విడవలూరులో పని చేసినకాలంలో చెలికల గ్రామానికి చెందిన దళితులు జంగం కృష్ణయ్య, ఓజిలి వెంకటరమణయ్య, పల్లం సుధాకర్, చోడం పద్మమ్మ తదితరులు వద్ద విద్యుత్ బిల్లులు వసూల్లు చేయడంతో పాటు మోటార్లకి కొత్త కనెక్షన్లు ఇప్పిస్తానని రూ.వేలు వసూలు చేశాడు. కాగా ఏఈ విజయలక్ష్మి సోమవారం చెలికల గ్రామానికి వెళ్లారు. విద్యుత్ బకాయిలు ఉన్నాయని వెంటనే చెల్లించాలని దళితులను కోరారు. దీంతో బాధితులంతా తాము చంద్రశేఖర్‌కి నగదు చెల్లించామని ఫోన్‌పేను చూపించారు. దీంతో చంద్రశేఖర్ అవినీతి వెలుగులోకి వచ్చింది.

తిరిగి నగదు చెల్లిస్తా...

చెలికల గ్రామానికి చెందిన కొందరి వద్ద విద్యుత్ బిల్లులు వసూలు చేశాను, కొందరికి చెల్లించాను, మరికొందరికి కూడా చెల్లిస్తాను.

- చంద్రశేఖర్, అసిస్టెంట్ లైన్‌మన్

బాధితులు ఫిర్యాదులు ఇవ్వండి

బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదులు ఇవ్వాలి. చెలికలలో లైన్‌మన్ చంద్రశేఖర్ బిల్లులు వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేయలేదు. లిఖితపూర్వకంగా ఫిర్యాదులు ఇస్తే చర్యలు తీసుకుంటాం.

- విజయలక్ష్మి, ఏఈ



ఆర్టీసీ అద్దె బస్సు కింద పడి వృద్ధురాలి మృతి



మృతిచెందిన నల్లి అంకమ్మ

చేజర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అద్దె బస్సు కిందపడి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన నెల్లూరు కలువాయి ప్రధాన రహదారిలోని చేజర్ల మండలం కాకివాయి రోడ్డు వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పూర్తి వివరాల మేరకు.. చేజర్ల మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన నల్లి అంకమ్మ (70) సోమవారం ఉదయం కలువాయికి వెళ్ళేందుకు నెల్లూరు- కలువాయి ప్రధాన రహదారిలోని కాకివాయి రోడ్డు వద్ద ఉన్న బస్‌షెల్టర్‌లో మరికొందరితో కలిసి వేచిఉంది. ఈ సమయంలో నెల్లూరు నుంచి కలువాయికి వస్తున్న ఆర్టీసీ అద్దెబస్సు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆగింది. అయితే అందరూ ఎక్కారని భావించి డ్రైవరు బస్సును కదిలించాడు. కాగా, వృద్ధురాలు కావడంతో బస్సు ముందు నుంచి నెమ్మదిగా వస్తున్న అంకమ్మను గమనించని డ్రైవరు ముందుకు కదిలించడంతో బస్సు ఆమె మీద నుంచి వెళ్లడంతో సంఘటనాస్థలంలోనే మృతిచెందింది. సమాచారం అందుకున్న చేజర్ల పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. మృతురాలు చేజర్ల మండలం బిల్లుపాడు గ్రామ పంచాయతీలో టీడీపీ వార్డు సభ్యురాలుగా ఉంది. ఆమె మృతితో కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు శోకసంద్రంలో మునిగిపోయారు.

విద్యుదాఘాతంతో మహిళ...



గంటా గీతాంజలి (ఫైల్)

కావలిరూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ రామచంద్రాపురంలో విద్యుదాఘాతంతో గంటా గీతాంజలి (31) మృతిచెందిన ఘటన సోమవారం వెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మృతురాలి భర్త కృష్ణమూర్తి తిరుణాళ్లలో బొమ్మలు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. గొలగమూడి వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా 5 రోజులుగా ఆలయం వద్ద బొమ్మలు అమ్ముకుంటూ అక్కడే ఉన్నాడు. గీతాంజలి తన 11 ఏళ్ల బిందు లహరి, 10 ఏళ్ల పల్లవితో కలిసి రామచంద్రాపురంలో ఉంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి భార్య, పిల్లలతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఉదయం కుమార్తెలు నిద్రలేసి చూడగా తల్లి గీతాంజలి ఇన్వర్టర్ వద్ద కింద పడిపోయి ఉంది. ఎంత లేపినా లేవకపోవడంతో ఆ విషయాన్ని ఫోన్‌లో తండ్రికి చెప్పారు. దీంతో కృష్ణమూర్తి పక్కనే ఉన్న బంధువులకు ఫోన్ చేసి చెప్పడంతో వారు వచ్చి చూడగా ఒంటిపై, చేతి మణికట్టుకు కాలిన గాయాలు ఉండటంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు గుర్తించి కృష్ణమూర్తికి తెలిపారు. కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ తిరుమల రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోనలో గుర్తు తెలియని మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాపూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచలకోన అటవీశాఖ అతిథిగృహం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సోమవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని చూసి పెంచలకోన పోలీస్ అవుట్‌పోస్టుకు సమాచారమిచ్చారు. దీంతో రాపూరు పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించి, మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు. మృతదేహం సమీపంలో గడ్డి మందు సీసా ఉందని, గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రాపూరు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ వెంకటరాజేష్ కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● కాలిపోయిన నగలు, రూ. 6 లక్షల నగదు



ప్రమాదంలో కాలిపోయిన వంట సామగ్రి

మనుబోలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టువపల్లి దళితవాడలో ఓ పూరిల్లు సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుల కథనం మేరకు.... కాలనీకి చెందిన బత్తల వెంకటకృష్ణయ్య, మమత రేకుల ఇంట్లో నివసిస్తున్నారు. పేదరికం కారణంగా గోడలకు బదులుగా నాలుగు పక్కలా తాటాకు మట్టలు అల్లుకుని ఉన్నారు. బేల్దారి పనులకు వీరిద్దరూ గూడూరుకు వెళుతుంటారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గుర్తించారు. విద్యుదాఘాతా నికి తీగల్లోంచి మంటలు చెలరేగి తాటాకు మట్టలకు వ్యాపించాయి. దీంతో ఇంట్లోని బీరువాలో ఉన్న రూ. 2లక్షలు, 6సవర్ల బంగారం కాలి బూడిదయ్యాయని, ఈ ప్రమాదంతో రూ. లక్షల్లో ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు విలపించాడు. సమాచారం అందుకున్న వీఆర్వో నాగేశ్వరరావు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

భోగ్యంవారిపల్లిలో శ్రీగంధం చెట్ల దొంగలు

● బెంబేలెత్తుతున్న గ్రామస్థులు



మోడుగా మిగిలిన శ్రీగంధం చెట్టు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 25: జిల్లా కేంద్రానికి శివారు గ్రామమైన భోగ్యంవారిపల్లిలో శ్రీగంధం చెట్ల దొంగల ఆగడాలతో గ్రామస్థులు బెంబేలెత్తుతున్నారు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన భోగ్యం మార్కండేయులు పొలంలోని శ్రీగంధం చెట్లు నరికి చోరీకి పాల్పడ్డారు. రోజు మాదిరిగా సోమవారం పొలానికి వెళ్లిన బాధితుడు చెట్లు నరికి ఉండడం చూసి విస్తు పోయాడు. వారం క్రితం అదే గ్రామానికి చెందిన భోగ్యం కోటయ్య, ఉలవల మురళీకృష్ణ, సుత్తినేని శివరామయ్యల పొలాల్లో ఆరు చెట్లను నరికి తరలించుకొని వెళ్లడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. ఏళ్ల తరబడి కంటికి రెప్పలా కాపాడుకున్న చెట్లు చోరీకి గురికావడంతో బోరున విలపిస్తున్నారు. ఈవిషయమై తమకు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతులు ఫిర్యాదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
కోడిగుడ్ల ధర (100):	540



వర్గీకరణ పేరుతో మాలలకు అన్యాయం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలను తొక్కి వేయడాన్ని ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ విమర్శించారు. సోమవారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో బీజేపీ, టీడీపీ భాగస్వామ్యంతో ప్రధాని దేశవ్యాప్తంగా ఎస్సీలకు అన్యాయం చేయాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మోదీ ఓట్ల దొంగతనం బయటపడుతుందని దేశంలో మెజార్టీ వర్గమైన దళిత వర్గాన్ని అణిచి వేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఉలవపాటి శీనయ్య, దాసరి చిట్టిబాబు, నెలి సూరిబాబు, సునీల్‌కుమార్, కలివేలి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డెక్కిన క్రికెట్ ఎంపికల వివాదం

● అసోసియేషన్ నేతలతో తల్లిదండ్రుల వాగ్వాదం

నెల్లూరు(విద్య), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో తల్లిదండ్రుల్లో ఒక్కసారిగా ఆగ్రహం పెల్లుబికింది. తామెంతో కష్టపడి పిల్లలను క్రికెట్‌లో చేర్పించి, నిరంతరం సాధన చేయించి, పోటీలకు సన్నద్ధం చేస్తుంటే అసోసియేషన్ నాయకులు ఇష్టానుసారంగా ఎంపికలు జరుపుతున్నారని మండిపడ్డారు. సోమవారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉన్న క్రికెట్ ప్రాంగణం వద్ద అసోసియేషన్ నాయకులు, తల్లిదండ్రులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి...

జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కమిటీ నిత్యం వివాదాలకు నిలయంగా మారింది. క్రీడాకారుల ఎంపికల్లో పారదర్శకత లేకుండా కొంతమంది ఇతర ప్రాంతాలకు చెందిన క్రీడా కారులు, జిల్లాలో ఆర్థికంగా స్థిరపడిన కుటుంబాలకు చెందిన క్రీడాకారులను ప్రతిభ లేకుండానే ఎంపిక చేస్తూ అర్హులకు అన్యాయం చేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నెల్లూరుకు చెందిన అల్లారెడ్డి సుధాకర్ కుమార్తె సాత్వికరెడ్డి జిల్లా అండర్-19 జట్టులో ప్రధాన క్రీడాకారిణిగా రాణిస్తున్నారు. ఇటీవల విశాఖలో జరిగిన అండర్-19 సౌత్‌జోన్‌కు ఎంపికైన ఆమెను అక్కడ జరిగిన మ్యాచ్‌లలో ఆడేందుకు అవకాశం ఇవ్వకుండా ఇతర జిల్లాలకు చెందిన ఇద్దరు క్రీడాకారిణులకు అవకాశం ఇవ్వడంపై అసోసియేషన్ నేతలను నిలదీశారు. దీంతో నాయకులు, తమకు ఇష్టమైన వారిని ఆడిస్తామని, తమను ఎవరూ ప్రశ్నించడానికి వీల్లేదంటూ తల్లిదండ్రులతో దురుసుగా ప్రవర్తించారు. అసోసియేషన్‌కు జనరల్ మేనేజర్‌గా ఉన్న భాను అనే వ్యక్తి క్రీడాకారులకు అన్యాయం చేస్తున్నాడని తల్లిదండ్రులు ఆరోపించారు. క్రీడాకారిణులతో అసభ్యకరంగా వ్యవహరించడం, క్రీడామైదానంలోనే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం ఎంతవరకు సమంజసమంటూ గొడవకు దిగడంతో అసోసియేషన్ నాయకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువురికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించేశారు. ఈ ఘటనపై జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ అసోసియేషన్‌లో ఎలాంటి అవకతవకలు జరగడం లేదని అన్నీ సవ్యంగానే జరుగుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రుల ఆరోపణల్లో వాస్తవాలు లేవన్నారు. తల్లిదండ్రులు మాత్రం కలెక్టర్, ఏసీఏ ప్రతినిధులు స్పందించి అసోసియేషన్‌పై విచారణ జరిపి తమ బిడ్డలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



క్రికెట్ క్రీడా ప్రాంగణంలో క్రీడాకారులతో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు





అండర్‌బ్రిడ్జిలో రోడ్డు నిర్మాణ పనులు

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

శరవేగంగా సిమెంటు రోడ్డు..

నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో దశాబ్దాలుగా పట్టించుకోని రామలింగాపురం అండర్ బ్రిడ్జి రోడ్డుకు కూడా మోక్షం లభించింది. ముత్తుకూరు బస్టాండ్ నుంచి రామలింగాపురం వరకు సీసీ రోడ్డు పనులు చేపట్టారు. ఒకవైపు రోడ్డు వేస్తూ మరోవైపు పూర్తయిన రోడ్డుకు క్యూరింగ్ పనులు చేపడుతున్నారు. ఇందుకోసం ఆ మార్గంలో తాత్కాలికంగా రాకపోకలు నిలిపివేశారు.

జీజీహెచ్‌లో నర్సులకు న్యాయం చేయకపోతే ఆందోళన

● ఏపీ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సుకు న్యాయం జరగకపోతే ఆందోళన చేపడతామని ఏపీ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు రాధమ్మ, కోటమ్మ హెచ్చరించారు. జీజీహెచ్‌లో పీజీ, జూనియర్ వైద్యుల దాడికి గురైన మేల్ స్టాఫ్ నర్సు వెంకటప్పయ్యను రాష్ట్ర కాంట్రాక్టు నర్సింగ్ అసోసియేషన్, రెగ్యులర్ నర్సింగ్ అసోసియేషన్ నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, ఆసుపత్రి డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డితో సమావేశం అయ్యారు. అకారణంగా మేల్ స్టాఫ్‌నర్సుపై దాడి చేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీనిపై ఆసుపత్రిసూపరింటెండెంట్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ జరిగిన సంఘటనపై విచారణ జరుగుతోందని, ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలియచేశారు.



నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాళ్లను సత్కరిస్తున్న నర్సులు

ఇందుకు నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ బాధితునికి న్యాయం జరగకపోతే రాష్ట్రస్థాయి ఉద్యమానికి పిలుపునిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వరలక్ష్మి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యవతి, వసుంధర, నర్సింగ్ సూపరింటెండెంట్ సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ విగ్రహాల ఏర్పాటుపై వివాదం

జలదంకి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవరం పంచాయతీ తిమ్మసముద్రంలో వినాయక విగ్రహాల ఏర్పాటు విషయమై ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. రామాలయం వద్ద ప్రతీ ఏడాది గణేశ్ విగ్రహం ఏర్పాటు చేసి వినాయక తిని ఉత్సవాలు జరుపుకునేవారు. ఈ ఏడాది కూడా యువకులు చందాలు వేసుకుని విగ్రహం ఏర్పాటుకు సన్నద్ధమై గణనాథుడిని కూడా గ్రామానికి తరలించారు. అయితే రామాలయం వద్ద తామే విగ్రహాన్ని పెట్టాలని మరోవర్గం పట్టుబట్టడంతోపాటు గణనాథుడి విగ్రహాన్ని సైతం తెచ్చారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం పోలీసు స్టేషన్‌కు చేరింది. దీంతో కలిగిరి సీఐ వెంకటరమణ, జలదంకి ఎస్ఐ లతీఫున్నీసా సోమవారం గ్రామానికి చేరుకుని ఇరువర్గాలతో చర్చలు జరిపారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



మహిళకు స్మార్టు కార్డు అందచేస్తున్న టీడీపీ నాయకులు

నెల్లూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బుజబుజ నెల్లూరులో స్మార్ట్ రేషన్‌కార్డులను సోమవారం లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ పౌరసరఫరాలలో లోపాలు తలెత్తకుండా ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో స్మార్ట్ కార్డులను అందజేస్తోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నాణ్యమైన సరుకులు అందచేస్తోందని తెలిపారు.

● టీడీపీలో చేరిక

రూరల్ మండలంలోని కొత్తవెల్లంటి గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు సోము జనార్దన్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరు శాతం ఫలితాలు సాధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, జలదంకి సుధాకర్, శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పరంధామరెడ్డి, ప్రదీప్, శేఖర్ పాల్గొన్నారు.



'సుఖీభవ' అందకపోతే ఆందోళన వద్దు

● వ్యవసాయ శాఖ నెల్లూరు ఏడీ శ్రీదేవి

అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందచేసే అన్నదాత సుఖీభవ నిధులు అందని వారు ఆందోళన చెందాల్సిన పనిలేదని నెల్లూరు వ్యవసాయ శాఖ ఏడీ శ్రీదేవి తెలిపారు. వారి వివరాలు రైతు సేవ కేంద్రాల్లో అందచేస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

?: ఎడగారులో పంట సాగు చేసిన రైతుల్లో కొందరికి 'సుఖీభవ' రాలేదంటున్నారు.

!: రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ లింకు చేసుకుని ఆ వివరాలు స్థానిక రైతు సేవ కేంద్రంలో ఇస్తే చాలు. మేము వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వానికి పంపుతాము. మలి విడతలో వారికి నిధులు అందుతాయి.

?: యూరియా కొరతకు కారణం. తగినంత సరఫరా లేదా...

!: మితిమీరిన వాడకం వల్లే కొరత ఏర్పడింది. ప్రస్తుతం అదికూడా లేదు. అవసరం లేకపోయినా తీసుకెళ్లిపోతున్నారు. యూరియా వాడకంపై రైతులు పూర్తిగా అవగాహన తో ఉండాలి. మేము నిర్వహించే సదస్సుల్లో ఇదే చెప్తున్నాము.

?: అధిక యూరియా వాడకంతో కలిగే అనర్థాలేమిటి.

!: చాలా ఉన్నాయి. దీనిని ఎంత తక్కువగా వాడితే అంత మంచిది. మితిమీరి వాడితే క్రమేణ భూమి సహజత్వాన్ని కోల్పోతుంది. ఆపై భూసారం తగ్గి పంట దిగుబడులు రావు. భూమి కలుషితమవుతుంది.

?: అక్కడక్కడా వరి కోతలు మొదలవుతున్నాయి. మరి కొనుగోలు కేంద్రాల మాటేమిటి.

!: నెల్లూరు రూరల్లో 8 వేల ఎకరాల్లో వరి పండుతోంది. పైరు వెన్ను దశ దాటుతోంది. ధాన్యం సేకరణకు నాలుగు కేంద్రా లు అవసరమని ఉన్నతాధికారులకు చెప్పా ము. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాము. ఎంఎస్పీకి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాము.

?: అన్నదాతలకు రాయితీ పనిముట్లు ఎప్పుడిస్తారు.

!: వ్యవసాయ పనిముట్ల కోసం మేము ప్రభుత్వానికి సిఫార్సు చేశాము. ఇటీవల కొన్ని ఇచ్చాము. నూతన బడ్జెట్‌తో త్వరలో వస్తాయి. రాగానే అందరికీ తెలియచేస్తాము.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

జాతీయ కవితల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు(విద్య), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పురిమిళ్ల ఫౌండేషన్, అక్షరాల తోవ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో నగరంలోని ఎస్వీఆర్ పాఠశాల విద్యా ర్థులు విజేతలుగా నిలిచారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు మాట్లాడుతూ బాల కవులు ఎస్ కారుణ్య, పీవీ తనూజ, బేబీ జాహ్నవి, ఆర్ విష్ణుసాయి, కే దివ్యశ్రీ, యూ మేధశ్రీ, పీ సాయిసాహితి ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా ప్రశంసాపత్రాలు, పుస్తకాలను బహుమతులుగా అందుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెన్నా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీధర్‌బాబు, ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయుడు అంకబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో శ్రీనివాసులు, శ్రీధర్‌బాబు తదితరులు

అక్రమ నిర్మాణాలపై నిఘా ఉంచాలి

● నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అన్నీ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జరగకుండా నిత్యం నిఘా ఉంచాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న ఆయన నగరవాసుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలన్నింటినీ ప్రాథమిక దశలోనే గుర్తించి ఆపేయాలని సూచించారు. డివిజన్ల వారీగా పర్యవేక్షణ ఉండాలన్నారు. రోడ్లను ఆక్రమించి వాహనాలు నిలపడం, దుకాణాలు ఏర్పాటు చేయడాన్ని అరికట్టాలన్నారు. ముందుగా మైపాడురోడ్డులోని స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ను సందర్శించారు. ఆ బజారులో దుకాణాల ఏర్పాటును పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



నగర వాసులతో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

పాములొస్తున్నాయి సార్!

● శోధన్‌నగర్ సచివాలయం సిబ్బంది మొర

తమ సచివాలయంలోకి నిత్యం పాములు వస్తున్నాయని శోధన్‌నగర్ ప్రాంత సచివాలయ ఉద్యోగులు కమిషనర్‌కు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో అర్జీ ఇచ్చారు. కార్యాలయం కిటికీల్లోంచి తరచూ పాములొస్తున్నాయని, నేలలో రంధ్రాలుండటంతో అవి వాటిల్లోకి వెళ్తున్నాయని చెప్పారు. పాముల సంచారంతో తీవ్ర భయాందోళన చెందుతున్నామని, వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు.

సీపీఐ బలోపేతానికి కృషి

● పార్టీ జిల్లా కార్యదర్శి అరిగెల

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీపీఐను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అరి గెల సాయి వెల్లడించారు. ఒంగోలులో జరు గుతున్న పార్టీ రాష్ట్ర మహాసభల్లో సోమవారం జిల్లా కార్యదర్శిగా ఆయనను ఏకగ్రీంగా ఎంపిక చేశారు. ఈ కార్యదర్శి నివేదికపై ఆయన మా ట్లాడారు. రానున్న మూడేళ్లలో పార్టీని జిల్లాలో బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, యువజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేసి వారిద్వారా పార్టీని పటిష్ఠం చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో కమ్యూ నిస్టు పార్టీని రాష్ట్రంలోనే మూడవ ప్రత్యా మ్నాయ పార్టీగా మార్చేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.



రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న అరిగెల సాయి

క్షయ నివారణ లక్ష్యాలు సాధించాలి

● జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 25 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధి నివారణ లక్ష్యాలను సాధించాలని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. సోమవారం నగరంలోని డేమియన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ట్రస్ట్‌లో క్షయ వ్యాధిపై సమీక్ష జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు అత్యుత్తమ చికిత్సలు అందించాలని సూచించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు విషయాలు వెల్లడించారు.

ఏపీ మార్క్‌ఫెడ్‌కు 'షోకాజ్'

● కృత్రిమ కొరతను అరికట్టేందుకు తనిఖీలు

నెల్లూరురూరల్, ఆగస్టు 25,(ఆంధ్రజ్యోతి) : ఎరువుల కృత్రిమ కొరతను అరికట్టేం దుకు ప్రభుత్వం తనిఖీలకు ఆదేశించడంతో నెల్లూరు రూరల్లోని పలు ప్రాంతాల్లో వ్యవసాయశాఖ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఏపీ మార్క్‌ఫెడ్ కార్యాలయంలో స్టాకును పరిశీలించగా నిల్వలో తేడా లుండటంతో సంబంధిత అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేసినట్లు ఏడీ కన్నయ్య, ఏవో నాగ మోహన్ తెలిపారు. అనంతరం సాయి వసుధ ఎరువుల దుకాణంలో తనిఖీలు చేపట్టగా అక్కడ కూడా నిల్వలో తేడాలు గుర్తించారు. ఆ దుకాణంలోని సుమారు రూ.4.04 లక్షల స్టాకు అమ్మకాలపై ఆంక్షలు విధించారు. తమ అనుమతి లేకుండా అమ్మరాదని నోటీసులు జారీ చేశారు. అనంతరం వెల్లంటి గ్రామంలోనూ తనిఖీలు నిర్వహించారు.



వెల్లంటి గ్రామంలోని ఎరువుల దుకాణంలో పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

చేపల పెంపకంలో నీటి నాణ్యత, నిర్వహణ కీలకం

● కేవీకే శాస్త్రవేత్త హరిసాదు

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చేపల జీవనమంతా నీటిపైనే ఆధారపడి ఉంటుందని, చేపల పెంపకంలో నీటి నాణ్యత నిర్వహణ అత్యంత కీలకమని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) మత్స్య విభాగం శాస్త్రవేత్త హరిసాదు పేర్కొన్నారు. నెల్లూరు కేవీకేలో ఆక్వా కల్చర్ విభాగం ఆధ్వర్యంలో కార్ప్ చేపల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై జరుగుతున్న శిక్షణలో భాగంగా సోమవారం ఆయన పలు అంశాలను వివరించారు. అమ్మోనియా, నైట్రేట్ స్థాయిలు అధికమైతే చేపలకు విషప్రభావం కలుగుతుందని, అందుకని అధిక ఆహారం వేయకూడదని పెంపకందారులకు సూచించారు. పీహెచ్ స్థాయిని సరిచే యడానికి సున్నంగానీ, డోలోమైట్‌గానీ వాడాలని తెలియజేశారు. పంటకు ముందు చెరువును శుభ్రంగా సిద్ధం చేయడం, సేంద్రియ ఎరువులు వేయడం వల్ల చేపలకు సహజంగా లభించే ఆహారమైన పాచి వృద్ధి చెందుతుందని చెప్పారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ లోకేష్‌బాబు మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడడం వల్ల సంఘటిత శక్తిని పెంపొందిం చుకుని ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉంటుందని తెలిపారు. వీఎస్‌యూ విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులు శారీరక, మానసిక ఆరోగ్యం కాపాడుకోవడం అత్యంత అవసరమని సూచించారు. సమయపాలన, యోగా, ధ్యానం, సానుకూల దృక్పథం వంటివి రైతుల పనితీరును మెరుగుపరుస్తాయని తెలియజేశారు.



మాట్లాడుతున్న మత్స్య విభాగం శాస్త్రవేత్త హరిసాదు

కోనసీమ మెప్మా పీడీగా పెంచలయ్య

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : గూడూరు మెప్మాలో సీఎంఎంగా పని చేస్తున్న దర్శిగుంట పెంచలయ్యను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తూ మెప్మా మిషన్ రాష్ట్ర డైరెక్టర్ తేజ్ భరత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతి పొందిన పెంచలయ్యకు సోమవారం నెల్లూరులో మెప్మా ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

పెయ్యదూడల పథకంపై అవగాహన కల్పించండి

● వీపీసీ డీడీ సోమయ్య

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పెయ్యదూడల ఉత్పత్తి పథకంపై పాడిరైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని నెల్లూరులోని వెటర్నరీ పాలీక్లినిక్ (వీపీసీ) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సోమ య్య అధికారులు, పశువైద్యులకు సూచించారు. వీపీసీ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన సమీక్ష జరిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాడిరైతుల అవసరాలు, వారికి అవసరమైన సేవలు, రుణాలు తదితర అంశాలపై ఈ నెలాఖరులోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పశువులకు వ్యాధులు రాకుండా టీకాలు వేయాలన్నారు. ఉత్తమ సేవలకుగాను స్వాతంత్ర్య దినోత్సవాన మంత్రి నారాయణ నుంచి అవార్డు అందుకున్న వీపీసీ ఏడీ డాక్టర్ ఎం మాలకొండయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏడీలు కృష్ణమూర్తి, రామచంద్రరావు, చైతన్య కిషోర్, వీఏఎస్ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ మాలకొండయ్యను సన్మానిస్తున్న డీడీ సోమయ్య, పక్కన ఏడీలు

29న టీఆర్ఆర్‌లో మెగా జాబ్‌మేళా

కందుకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈనెల 29న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ తెలిపారు. ఏపీఎస్ఎస్డీసీ కో ఆర్డినేటరు ఇమాజ్‌తో కలిసి సోమవారం ఆయన కళాశాలలో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. పది, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ తదితర కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9848050543, 6301543185ను సంప్రదించాలని కోరారు.



నేటి నుంచి సిద్ధి విఘ్నేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పప్పులవీధి సిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ చైర్మన్ బయ్యా ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆలయంలో ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం నదీ తీర్థ గ్రహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. బుధవారం ఉదయం 9గంటలపైన ధ్వజారోహణం జరుగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం మూషిక వాహనంపై నగరోత్సవం జరుగుతుందని, భక్తులు తరలిరావాలని కోరారు. 31వతేదీ ఆదివారం సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామికి కల్యాణం, గజవాహనోత్సవం, సెప్టెంబరు 4వతేదీ వసంతోత్సవం జరుగుతాయని తెలిపారు.

మట్టి వినాయకులను పూజిద్దాం



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, తదితరులు

గోడపత్రికను ఆవిష్కరించిన కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలంటూ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడపత్రికను కలెక్టర్ ఆనంద్ ఆవిష్కరించారు. తిక్కనభవన్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మట్టి గణపతులను వాడి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో ఫత్తేఖాన్‌పేట రైతు బజారులో 2 వేల మట్టి వినాయక ప్రతిమలను బుధవారం ఉదయం 10.30గంటలకు ప్రజలకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

మట్టి గణనాథులకీ.. జై!

పీవోపీ.. రంగుల బొమ్మలు మార్కెట్‌ను ఏలుతున్నా ఆ గ్రామస్థులు మాత్రం తమ కులవృత్తిని వీడలేదు. వినాయక చవితి వచ్చిందంటే చాలు నెల రోజుల నుంచే ఆ గ్రామంలో సందడి నెలకొంటుంది. అప్పటివరకు కులవృత్తిని పక్కన పెట్టేసిన వారు కూడా గణనాథుల ప్రతిమల తయారీలో నిమగ్నమవుతారు. జిల్లా నలుమూలలకు తరలించి విక్రయిస్తారు. తమ చేతి వేళ్లతో రూపుదిద్దుకున్న గణనాథులు ప్రతి ఇంటా పూజింపబడటం తమ అదృష్టంగా భావిస్తారు వెంగారెడ్డిపాళెం కుమ్మర్లు. పెద్దగా ఆదాయం లేకపోయినా కూలి గిట్టుబాటు అయితే చాలని సంతృప్తితో సంప్రదాయంగా కొనసాగిస్తూ పరోక్షంగా పర్యావరణహితులుగా ఉన్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)



- తరతరాలుగా ప్రతిమల తయారీ
- సంప్రదాయంగా కొనసాగిస్తున్న వెంగారెడ్డిపాళెం కుమ్మర్లు
- జిల్లా అంతటా తరలింపు.. విక్రయాలు

సంగం మండలంలోని వెంగారెడ్డిపాళెం ఒక కుగ్రామం. ఒకప్పుడు సుమారు 30 కుటుంబాలకుపైగా కుమ్మరులు కులవృత్తినే నమ్ముకుని జీవించేవారు. కానీ సమాజంలో కుండల వినియోగం పూర్తిగా అంతరించింది. దీంతో ఒకరిద్దరు తప్ప మరెవరూ ఆ వృత్తిని చేయడం లేదు. కానీ వినాయక చవితి పండగ వచ్చేందంటే చాలు గ్రామస్థులంతా ఏకమవుతారు. ప్రతి ఇంటా పూజించే మట్టి గణనాథులను తయారు చేయడం అదృష్టంగా భావించి సుమారు 20 కుటుంబాలు గణనాథుల ప్రతిమలను తయారు చేస్తున్నాయి.

• నెల రోజుల ముందు నుంచే..

ప్రతి ఏడాది వినాయక చవితికి నెల ముందు అంటే ఏరువాక ఏకాసి నుంచే వీరు మట్టి వినాయక విగ్రహాల తయారీలో నిమగ్నమవుతారు. ప్రతిమల తయారీకి అందుబాటులో మట్టి లభ్యం కాకపోయినా దూరప్రాంతం నుంచి తెప్పించుకుంటారు. సాధారణంగా పాత్రలు తయారీకి కాళ్లతో మట్టిని తొక్కి అనువుగా చేసుకొంటారు. అదే గణనాథుల (బొమ్మల) తయారీకైతే ఎంతో నిష్ఠతో చేతులతోనే మట్టిని మెత్తగా పిసికి సిద్ధం చేస్తారు. అర అడుగు నుంచి అడుగు ఎత్తు ఉండేలా వివిధ ఆకారాల్లో ప్రతిమలను తయారు చేస్తారు. మొదట్లో చేతితో మట్టి గణపతులను తయారు చేస్తుండగా, ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో అచ్చుల ఆధారంగా ప్రతిమలను తయారు చేస్తున్నారు. అలా తయారు చేసిన వాటిని వారం రోజులపాటు నీడలో ఆరబెట్టి వివిధ సహజమైన రంగులతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ముందుగా ఆర్డర్ ఇస్తే 10 అడుగుల భారీ మట్టి విగ్రహాలను తయారు చేయగల నైపుణ్యం కలిగిన కళాకారులు ఈ గ్రామంలో ఉన్నారు. కానీ ధర ఎక్కువ కావడంతో ఎవరూ ముందుకు రావడం లేదు.



ఆర్డర్ ఇచ్చిన వారికి ఆటోలో బొమ్మలు తరలిస్తూ..

• జిల్లావ్యాప్తంగా తరలింపు

వెంగారెడ్డిపాళెంవాసులు తయారు చేసిన గణనాథులను పండక్కి నెల్లూరు, బుచ్చి, కావలి, కోవూరు తదితర పట్టణాలకు విక్రయించేవారు. ఖర్చులు పెరుగుతుండటంతో వీరికి గిట్టుబాటు కావడం లేదు. వచ్చిన ఆదాయంతోనే సంతృప్తి పొందుతూ సంవత్సరాల నుంచి సంప్రదాయాన్ని వదలకుండా కొనసాగిస్తున్నారు.


• 30 వేల ప్రతిమలు

మీడియా మాధ్యమాల వల్ల వెంగారెడ్డిపాళెంలో మట్టి గణనాథుల తయారీ విషయం జిల్లా అంతటా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి ఎంతో మంది దాతలు, విక్రయదారులు ముందుగానే వీరికి ఆర్డర్లు వస్తున్నాయి. దీంతో 25 వేల నుంచి 30 వేల వరకు బొమ్మల తయారు చేసి సరఫరా చేస్తున్నారు.

ప్రోత్సాహం లేకున్నా..

వెంగారెడ్డిపాళెం ప్రజలకు పెద్దగా అక్షర జ్ఞానం లేకపోయినా తమ చేతితో తయారైనా గణనాథులు ఇళ్లలో పూజింపబడుతున్నాయనే సంతృప్తితో ఎంతో భక్తి, నిష్ఠతో గణనాథులను తయారు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేకున్నా మట్టి విగ్రహాల తయారీలో గిట్టుబాటుకాకున్నా సంతృప్తి కోసం మట్టి గణపతులను తయారీని కొనసాగిస్తున్న పర్యావరణ హితులుగా ఉన్న వీరికి అభినందనీయం.

ఎంతో సంతృప్తినిస్తోంది!




వినాయక పండగకు నెల రోజుల ముందు నుంచే మా గ్రామంలో సందడి ఉంటుంది. వినాయక బొమ్మలను ఆర్డర్‌పై తయారు చేయించుకోవడానికి ఎక్కడెక్కడ నుంచో వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మా గ్రామానికి వస్తున్నారు. మా మట్టి గణనాథులు వందల ఇళ్లలో కొలువై పూజింపబడుతుంటం ఎంతో సంతృప్తినిస్తుంది. పెద్దగా ఆదాయం లేకపోయినా కూలి గిట్టుబాటుకే తయారు చేసి ఇస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, తయారీదారుడు

బార్లు... బోర్లా!!

- ఒక్క దరఖాస్తూ పడలేదు
- నేటితో ముగియనున్న గడువు
- గత ప్రభుత్వ నిబంధనలే...
- అయినా ఆసక్తి చూపని యజమానులు
- ఇంకెవరూ ముందుకు రాకుండా హుకుం?

నెల్లూరు(క్రైం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం బార్ల ఏర్పాటుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ఉన్న బార్ల గడువు ఈ నెలాఖరుకు ముగుస్తుండటంతో నూతన బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. జిల్లాలో 50 బార్లు, గీత కులాలకు 5 బార్లు కేటాయించేలా మార్గదర్శకాలతో నూతన పాలసీని అందుబాటులోకి తీసుకువచ్చింది. గత ప్రభుత్వంలో ఉన్న నిబంధనలే అయినప్పటికీ ప్రస్తుత బార్ల యజమానులు ఎవరూ మళ్లీ దరఖాస్తుకు ఆసక్తి చూపడం లేదు. అప్పట్లో వేలం పాటలో పోటీ పడి మరీ బార్లను దక్కించుకున్న వ్యాపారస్తులు ఈ సారి అడుగు ముందుకు వేయడం లేదు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బార్ల పాలసీతో తమకు అనేక సమస్యలు ఉన్నాయని, తాము దరఖాస్తు చేసుకోమని ఇప్పటికే జిల్లాలోని బార్ల అసోషియేషన్ నాయకులు స్పష్టం చేశారు. అంతేకాదు ఇంకెవ్వరూ కూడా దరఖాస్తు చేసుకోకూడదంటూ హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా నూతన పాలసీ ప్రకారం బార్లకు దరఖాస్తు గడువు మంగళవారంతో ముగియనుంది. అయితే ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం గమనార్హం.



నేటితో గడువు ముగుస్తుంది

ప్రభుత్వం విడుదల చేసిన బార్ల పాలసీకి సంబంధించి నేటితో గడువు ముగుస్తుంది. జిల్లా వ్యాప్తంగా 50 బార్లు ఉండగా ఇప్పటి వరకు ఒక్క బారుకు కూడా దరఖాస్తు పడలేదు. నేడు వస్తాయని చూస్తున్నాము.

- శ్రీనివాసులు నాయుడు, ఎక్సైజ్ ఈఎస్



గంజాయి విక్రేతల వివరాలు వెల్లడిస్తున్న సీఐ

నలుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయించే నలుగురిని సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు తన కార్యాలయంలో నిందితుల వివరాలను విలేకరులకు వెల్లడించారు. నెల్లూరులోని కపాడిపాలెం రాయపువారి వీధికి చెందిన షేక్ సుభాని, షేక్ సిరాజ్ దంపతులు గంజాయి విక్రయి స్తుంటారు. గతంలో పోలీసులు సుభానిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఆమె భర్తపై సుమారు ఎనిమిది కేసులున్నాయి. అయినా వారి తీరులో మార్పు రాలేదు. విశాఖ ఏజన్సీ నుంచి కేజీ గంజాయిని రూ.1000 చొప్పున కొనుగోలు చేసి నెల్లూరుకు తీసురువచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి ప్యాకెట్ రూ.150 నుంచి 300 వరకు విక్రయిస్తున్నారు. ఆదివారం గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న సంతపేట ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు బాలకృష్ణ, సుల్తాన్‌బాషా కలిసి వారి ఇంటిపై దాడి చేశారు. దంపతులిద్దరితోపాటు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న అదే ప్రాంతానికి చెందిన కే జ్యోతి, రూరల్ మండలం కోడూరుపాడు గ్రామ కల్తీకాలనీకి చెందిన ఆటోడ్రైవర్ షేక్ మీరను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 6 కేజీల 350 గ్రాముల గంజాయి, రూ.22,500 నగదు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు తరలించి విచారించగా నగరంలో విక్రయాలకు పాల్పడుతున్నట్లు వెల్లడించంతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

మద్యం తాగొద్దన్నందుకు వాచ్‌మన్ ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని వాచ్‌మెన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన నెల్లూరులోని ఆచారివీధిలో చోటుచేసు కుంది. పోలీసుల సమాచరం మేరకు... నేపాల్‌కు చెందిన బికాష్(25), శిరిజన కూలీలు. ఏడాది కిందట వారు ప్రేమ వివాహం చేసుకున్నారు. ఐదునెలల కిందట ఉపాధి నిమిత్తం నెల్లూరుకు వచ్చారు. ఆచారవీధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో బికాష్ వాచ్‌మన్‌గా, అతని భార్య పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సాయంత్రం బికాష్ స్నేహితులతో మద్యం సేవించి అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. అనంతరం తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడుతుండగా వారు ఎందుకు మద్యం తాగావని మందలించారు. భార్య సైతం ఇప్పటి వరకు లేని అలవాటు ఎందుకు చేసుకున్నావంటూ నిలదీసింది. అనంతరం భోజనానికి పక్క గదిలోకి వెళ్లింది. దీంతో బికాష్ సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకున్నాడు. గమనించిన భార్య, సన్నిహితులు కలిసి బికాష్‌ను రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

1 నుంచి పోషకాహార మాసోత్సవాలు

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సెప్టెంబరు 1 నుంచి 30వ తేదీ వరకు పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక విలువల కలిగిన ఆహారం గురించి తల్లులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

'పెట్టుబడి పెట్టి మోసపోయాం'

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌కు చెందిన వీవీడీ రీవింగ్ ప్రై లిమిటెడ్ కంపెనీలో రూ.1.50 కోట్లు పెట్టుబడి పెట్టి మోసపోయామని నెల్లూరు నగరానికి చెందిన విజయలక్ష్మి, షేక్ హసీనా, డీ మాల్యాద్రి, సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. వీవీడీ కంపెనీ సీఈవో రాజశేఖర్‌రెడ్డి, ఎండీ రావుల సౌందర్య భార్గవి, డైరెక్టర్లు శశాంక్, రావుల మీరా తమను మోసం చేశారన్నారు. వారి కంపెనీలో పెట్టుబడి పెట్టితే మంచి లాభాలు వస్తాయని మాయ మాటలు చెప్పడంతో అగ్రిమెంట్ చేసుకున్నా మన్నారు. వారి మాటలు నమ్మి బ్యాంకుల్లో అప్పు చేసి డిపాజిట్ కట్టామని తెలిపారు. తర్వాత ఆ కంపెనీకి చెందిన వారందరూ డబ్బుతో పరారయ్యారని, పోలీసుకు ఫిర్యాదు చేశామని న్యాయం చేయాలని కోరారు.

ఎస్పీ పీజీఆర్‌ఎస్‌కి 93 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా 93 అర్జీలు వచ్చా యి. ఎస్పీ జీ కృష్ణకాంత్ మాట్లాడుతూ ఫిర్యాదులను త్వరితగ తిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల న్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పెరుగుతున్న అర్జీలు

పరిష్కారం ఎప్పుడో!

- కలెక్టర్ హెచ్చరిస్తున్నా కానరాని ఫలితం
- పీజీఆర్‌ఎస్‌కి 426 అర్జీలు
- వాటిలో రెవెన్యూవే 166

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు రాను రాను అర్జీల సంఖ్య పెరిగిపోతోంది. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యంతో ఈ అర్జీల సంఖ్య ఎక్కువవుతున్నట్లు సమాచారం. రెవెన్యూ శాఖకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటి పరిష్కార విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ప్రతీవారం కలెక్టర్ ఆనంద్ హెచ్చరిస్తున్నారు. అయినా మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలకు సకాలంలో పరిష్కారం లభించటంలేదు. కాగా, సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌కు 426 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 166, సర్వేశాఖవి 46 ఉన్నాయి. మిగిలినవి వివిధ శాఖలకు చెందినవి. అర్జీలు స్వీకరించిన కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ అర్జీలన్నింటినీ నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అలసత్వం వహించిన శాఖలపై చర్యలు తీసుకుంటా మని మరోసారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో హుస్సేన్ సాహెబ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ



దగదర్తి గ్రామ కొత్త హరిజనవాడ మహిళలు

• దాబా మాటున మహిళలను వేధిస్తున్నారు!

దగదర్తి మండల కేంద్రంలో కొత్త హరిజనవాడ కు పోయే దారిలో బీమాస్ దాబా ఏర్పాటు చేసి మహిళలను వేధిస్తున్నారని స్థానిక మహి ళలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాకి జ్యోతి, కర్నాటి సంధ్య, బుజ్జమ్మ, ఎస్తేరమ్మ, సుజాత తదితరులు మాట్లాడుతూ బీమాస్ దాబా యాజమాన్యం అక్రమంగా మద్యం అమ్మ కాలు జరుపుతోందని ఆరోపించారు. ఆ మార్గాన వెళ్లే మహిళలను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, వేధిస్తున్నారని చెప్పారు. దాబా యజమాని వినయ్, ఆయన మిత్రులకు విషయం తెలిపితే వారు కూడా అసభ్యంగా మాట్లాడుతూ దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకుని, ఆ ప్రాంతం నుంచి ధాబాను తొలగించాలని కోరారు.

• తాగునీటి బోరును ఆక్రమించారు

ప్రజల దాహార్తిని తీర్చే తాగునీటి బోరును ఆక్రమించారని కొండాపురం మండల గుడవ ళ్లూరు సర్పంచ్ బద్దిపూడి మాచర్ల, ఉప సర్పంచ్ వేములపాటి మణికుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ గ్రామంలోని సర్వే నంబరు 473-1లోగల పంచాయతీ స్థలంలో గ్రామ ప్రజల కోసం బోరు వేయించామని చెప్పారు. అయితే ఇటీవల గ్రామానికి చెందిన శ్రీనివాసులు, చెంచు రామయ్య ఆ స్థలాన్ని ఆక్రమించి గదులు కట్టించారన్నారు. నీటి సరఫరా ట్రాక్టరు బోరు వద్దకు వెళ్లడానికి లేకుండా ఆటంకం కలిగిస్తున్నారని తెలిపారు. దీంతో గ్రామస్తులకు తాగునీరు అందడం లేదని, కారకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



గుడవళ్లూరు సర్పంచి బద్దిపూడి మాచర్ల, ఉపసర్పంచి వేములపాటి మణికుమార్

72 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి చోరీ


• తాళాలు పగులగొట్టి దోపిడీ

నెల్లూరు(క్రైం) ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను దోచుకెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ఎన్‌జీవో కాలనీలో రాజేశ్వరి కుటుంబం నివసిస్తోంది. ఈ నెల23వ తేదీన కుటుంబమంతా కలిసి సైదాపురం మండలం చికవోలులో గ్రామదేవత ఉత్సవానికి వెళ్లారు. ఆ సమయంలో దుండగులు రాజేశ్వరి ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న 72 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు 500 గ్రాములు వెండి వస్తువులు దోచుకెళ్లారు. రాజేశ్వరి కుటుబం 24వ తేదీ రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు కన్పించలేదు. ఈ మేరకు సోమవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా స్టీల్ తరలించిన వారిపై కఠిన చర్యలు

• హౌసింగ్ ఈఈ నారాయణరెడ్డి

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు గృహ నిర్మాణశాఖ గోదాము నుంచి అక్రమంగా స్టీలు తరలించిన వారిపై త్వరలో చర్యలు చేపట్టడం జరుగుతుందని హౌసింగ్ ఈఈ పీవీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విజయవాడ విజిలెన్స్ డీఈ పీ చంద్రశేఖర్ రాజుతో కలిసి గోదామును పరరిశీలించి అనంతరం కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. దుత్తలూరు మండలానికి ప్రభుత్వం ఎన్ని టన్నుల స్టీలు మంజూరు చేసింది, లబ్ధిదారులకు ఎంతమేర పంపిణీ చేశారు, నిల్వ ఎంత ఉంది, వాటిల్లో వ్యత్యాసాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమంగా స్టీలు తరలించిన ఉదయగిరి ఏఈ రామకృష్ణపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయడం జరిగిందన్నారు. వారు త్వరలో అతనిపై చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు జారీచేసే అవకాశముందన్నారు. స్టీల్ అక్రమ తరలింపునకు సంబంధించి ఇంకా ఎవరిదైనా హస్తం ఉందో పోలీసుల విచారణలో తేలాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ పీరాన్, ఏఈ యర్రాప్రాయం, వర్కుఇనస్పెక్టర్లు పోలయ్య, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఉదయగిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే యోగాను అలవాటు చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంఈవో-1 వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దుర్గంపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హజరత్, ఉపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9589
వెండి కిలో ధర	రూ. 119500
వెండి ఒక గ్రాము	రూ. 122.50

న్యూస్ బాక్స్

ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన



ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

అనంతసాగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో లక్ష లీటర్ల తాగునీటి పథకం ట్యాంకు నిర్మాణం కోసం అధికారులు సోమవారం స్థలపరిశీలన చేశారు. ట్యాంకు నిర్మించేందుకు 5సెంట్ల స్థలాన్ని సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దారు జయవర్థన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుధాకర్, మండల టీడీపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఖాసీంబాష, పోకల శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దారి ఆక్రమణపై ఫిర్యాదు

అనంతసాగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరులో పంచాయతీకి సంబంధించిన బావి, పొలాలకు వెళ్లేదారిని కొందరు ఆక్రమించినట్లు గ్రామస్థులు సోమవారం స్పందనలో తహసీల్దారు జయవర్ధన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు వారు తెలిపారు.

గండిపాళెం జలాశయంలో నిమజ్జనం నిషేధం

ఉదయగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయంలో వినాయక విగ్రహాల నిమజ్జనం నిషేధమని జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం డెడ్ స్టోరేజీలో ఉన్నందువల్ల విగ్రహాలను నిమజ్జనం చేయరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా విగ్రహాలను జలాశయంలో నిమజ్జనం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వెలుగు సిబ్బంది లక్ష్యాలను అధిగమించాలి

ఉదయగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెలుగు సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం అధిగమించాలని ఏపీఎం శారా స్రవంతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సీసీలు, వీవోఏలు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. ఈ సమావేశంలో సంఘమిత్ర అధ్యక్షురాలు ప్రేమకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా : ఏడీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పురొంపిదొడ్ల, గణేశ్వరాపురం గ్రామాలకు 24గంటల విద్యుత్ సరఫరాను సోమవారం కనస్ట్రక్షన్ ఏడీ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను కొనసాగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పేరం సుధాకర్‌రెడ్డి, కాంట్రాక్టర్ త్రినాథ్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గర్భిణులు, చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని వైద్యాధికారిణి కరిష్మా సూచించారు. సోమవారం స్థానిక వైద్యశాలలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సకాలంలో పూర్తిచేయడంతో పాటు అన్ని రకాల రికార్డులను నమోదు చేయాలన్నారు. అనంతరం పంచాయతీల వారీగా సమీక్షించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజశేఖరరాజు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చండి

ఉదయగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆనకట్ట సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న సోమవారం కోరారు. కట్ట రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉందని, గతంలో ఓ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి మహిళ సైతం మృతిచెందిందన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే మార్చాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ చక్రబంధంలో ఉదయగిరి

● ప్రజలు, వాహనదారుల అవస్థలు



ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరిని ఏళ్లతరబడి ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. రోజురోజుకు వాహనదారుల సంఖ్య పెరుగుతుండడంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, వైద్యశాలలకు పరుగులు తీసే విద్యార్థులు, ప్రజలతో బస్టాండ్ సెంటర్, ప్రధాన కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ బస్సులతో సహా ఆటోలు, మోటారుబైకులు సైతం అధిక సంఖ్యలోనే పరుగులు తీస్తుంటాయి. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే బస్టాండ్ సెంటర్‌లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. దుకాణదారులతో పాటు ప్రజలు సైతం తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. దీంతో స్థానికులతో పాటు పలు మండలాల నుంచి నెల్లూరు, ఆత్మకూరు, కావలి, బెంగళూరు, చెన్నై, హైదరాబాదు, తిరుపతి వంటి పట్టణాలకు ప్రయాణాలు సాగించేవారు వారు బస్సుల కోసం పట్టుమని పది నిమిషాలు కూడా నిలబడే అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు. అలాగే వ్యాపారపరంగా విస్తరించడంతో సామగ్రిని తరలించే ప్రైవేట్ వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా నిలపడంతో ఆటుగా ఇతర వాహనాలు ముందుకు సాగే పరిస్థితి లేకుండా పోతోంది. మెయిన్ బజార్‌తో పాటు గండిపాళెం మార్గంలోను ఇలాంటి దుస్థితి నెలకొందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే కాకర్ల



దుత్తలూరులో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



ఆత్మకూరులో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఆర్డీవో పావని, అధికారులు

దుత్తలూరు (ఉదయగిరి), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచించారు. సోమవారం దుత్తలూరు-1 చౌక దుకాణంలో ప్రభుత్వం నూతనంగా మంజూరుచేసిన స్మార్ట్ రేషన్‌కార్డులను మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కంభం అను సూయమ్మ, శ్రీకుర్తి రవీంద్రబాబు, తహసీల్దారు వైనాగరాజు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●**ఆత్మకూరు:** పట్టణంలోని 20వ వార్డులో సోమవారం ఆర్డీవో పావని ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ వరకు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి కార్డులు అందచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆమె వెంట తహసీల్దారు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

●**సంగం:** స్థానిక 3వ రేషన్ దుకాణం పరిధిలోని కొత్తూరులో సోమవారం తహసీల్దారు సోమ్లానాయక్, ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, షేక్ బాబు, గిరి, వీఆర్వో మోహన్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శోభన్‌బాబు, కార్యదర్శి ఉదయ్, పాల్గొన్నారు.

●**ఏఎస్ పేట:** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరుచేసిన స్మార్ట్ రేషన్‌కార్డులను టిడిపి నాయకులు సోమవారం ఏఎస్ పేటలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ జిలాని, షేక్ రహ్మత్ నవాజ్, చల్లా హరికృష్ణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** స్థానిక గిరిజన కాలనీలో సోమవారం స్మార్ట్ రేషన్‌కార్డులను తహసీల్దారు జయవర్ధన్, మండల టీడీపీ అధ్యక్షుడు మెట్టుకూరు కృష్ణారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో చెరువు నీటిసంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి, ఎంపీటీసీ బుజ్జమ్మ, బీజేపీ అధ్యక్షుడు వల్లూరు రాజేష్‌రెడ్డి, జే నరసింహులు, చల్లా అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**చేజర్ల:** మండల కేంద్రమైన చేజర్లలో ఎంపిపి తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ బూదళ్ల వీరరాఘవరెడ్డి, తహసీల్దారు బి మురళి, ఎంపిడీవో అమర్ ఇంటింటికీ వెళ్ళి స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

●**మర్రిపాడు :** మండలంలోని గ్రామాల్లో టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారులతో కలిసి స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. మండల కేంద్రంలో ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ చెర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు గంగాదర్‌యాదవ్, తహసీల్దారు అనీల్‌కుమార్, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు శాఖమూరి నారాయణ, భీమవరం సొసైటీ అధ్యక్షుడు చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి :** మండలంలోని దాసరిపల్లి గ్రామంలో సోమవారం స్మార్ట్ రేషన్‌కార్డులను మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, మాజీ ఎంపీటీసీ సయ్యద్ కాలేషాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సయ్యద్ జమృత్‌జాఫర్‌మొహిద్దీన్, టీడీపీ నాయకులు బొజ్జా శ్రీనివాసులు, గడ్డం శ్రీనివాసులు, సయ్యద్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

●**వరికుంటపాడు(ఉదయగిరి రూరల్):** స్థానిక ఎస్సీ కాలనీలో సోమవారం తహసీల్దారు హేమంత్‌కుమార్ టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావుతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపిశ్రీనివాస్, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, సొసైటీ, నక్కలగండి చైర్మన్లు గుర్రం గోపి, వేమూరి మధు, పొద మాధవరావు, గొడుగులూరి మాలకొండ్రాయుడు, పోకా మహేష్, ఆంధ్రా బాలగురవారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

●**వింజమూరు:** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ముద్రించిన స్మార్ట్ రేషన్‌కార్డులను మండల టీడీపీ నాయకులు స్థానిక లబ్ధిదారులకు రేషన్ డీలర్లు, సచివాలయ సిబ్బంది సమక్షంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, సొసైటీ చైర్మన్ చల్ల వెంకటేశ్వర్లు యాదవ్, సొసైటీ డైరెక్టర్లు కోదూరు నాగిరెడ్డి, గని శ్రీనివాసులు, సర్పంచ్ నల్లగొండ సృజన, మండల ఉపాధ్యక్షులు అనంగి రమణయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

●**సీతారామపురం:** మండల కేంద్రంలో మండల అధికారులు, సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, మండల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి ప్రసాదు, తహసీల్దార్ ఫజిహా, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, వీకాష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయ పాలక మండలి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఈవో రఘురామయ్య

సంగం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు చెన్నకేశవస్వామి ఆలయ పాలక మండలి కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు దేవదాయ శాఖ గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయానికి పాలక మండలిని నియమించింది. ఈమేరకు ఈవో రఘురామయ్య పాలక మండలి చైర్మన్‌గా ఎంపికైన మందపాటి శ్రీహరిరెడ్డితో పాటు మరో తొమ్మిది మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

భూమి ఇప్పించాలంటూ రైతుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

సీతారామపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్ననాగంపల్లె రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబర్ 63లోని తమ భూమిని తమకు ఇప్పించాలంటూ సోమవారం గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమకు మంజూరైన భూములను ట్రాక్టర్‌తో దున్నుతుంటే గ్రామానికి చెందిన కొంతమంది అడ్డుపడుతున్నారని, మా భూములను సాగుచేసుకొనుటకు అవకాశం కల్పించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

సీతారామపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుల సమస్యలను పరిష్కరించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సొసైటీ అధ్యక్షుడు రాజశేఖర్‌కు సూచించారు. వింజమూరులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం కాకర్లను సీతారామపురం మండల మారంరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలోని రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆయనతో పాటు మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మాజీ కన్వీనర్ మొత్తంశెట్టి చెన్నకేశవులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, వీకాష్‌బాబు, మాజీ జడ్పిటిసి కలివెల జ్యోతి, చంద్రారెడ్డి, తోట మనోజ్, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయక ఉత్సవాలు జరుపుకోవాలి : సీఐ



మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

సంగం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలని సీఐ వేమారెడ్డి సూచించారు. సోమవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక విగ్రహాలు ఏర్పాటుచేసే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. సింగిల్‌విండో విధానంలో ఆన్‌లైన్‌లోనే సులభంగా అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. వేడుకల్లో డీజేలు, అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని, అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఉత్సవ కమిటీనే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, పోలీసులు, ఉత్సవ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలి : ఎమ్మార్పీఎస్



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉదయగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అనాదిగా అభివృద్ధికి నోచకోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని జిల్లా చేయాలని కోరుతూ సోమవారం వైసీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉదయగిరి, దుత్తలూరు తహసీల్దారులు ఎల్ రామ్మోహన్, వై నాగరాజులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు, సరిహద్దులు, పేర్ల మార్పులు, చేర్పులకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఉదయగిరి కేంద్రంగా కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వెనుకబడిన 21 మెట్ట మండలాలను కలిపి జిల్లా చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు కండ్లగుంట దయాకర్‌రెడ్డి, సింగరపు గంగాధర్‌రెడ్డి, బకీరు జాషువా, బెజవాడ బాల గురవయ్య, ఇత్తడి రమణయ్య, పెంచలయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని రైతు సంఘం ఆందోళన



లింగంనేనిపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

ఉదయగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును రద్దుచేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండలం లోని బండగానిపల్లి పంచాయతీ లింగంనేనిపల్లి గ్రామ రైతులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చి రైతులు నష్టపోతారని దుయ్యబట్టారు.

C.R.I.M.E N.E.W.S

ఆర్టీసీ అద్దెబస్సు కింద పడి వృద్ధురాలి మృతి



మృతిచెందిన నల్లి అంకమ్మ

చేజర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అద్దె బస్సు కిందపడి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన నెల్లూరు కలువాయి ప్రధాన రహదారిలోని చేజర్ల మండలం కాకివాయి రోడ్డు వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పూర్తి వివరాల మేరకు.. చేజర్ల మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన నల్లి అంకమ్మ (70) సోమవారం ఉదయం కలువాయికి వెళ్ళేందుకు నెల్లూరు- కలువాయి ప్రధాన రహదారిలోని కాకివాయి రోడ్డు వద్ద ఉన్న బస్‌షెల్టర్‌లో మరికొందరితో కలిసి వేచిఉంది. ఈ సమయంలో నెల్లూరు నుంచి కలువాయికి వస్తున్న ఆర్టీసీ అద్దెబస్సు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆగింది. అయితే అందరూ ఎక్కారని భావించి డ్రైవరు బస్సును కదిలించాడు. కాగా, వృద్ధురాలు కావడంతో బస్సు ముందు నుంచి నెమ్మదిగా వస్తున్న అంకమ్మను గమనించని డ్రైవరు ముందుకు కదలించడంతో బస్సు ఆమె మీద నుంచి వెళ్ళడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందింది. సమాచారం అందుకున్న చేజర్ల పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. మృతురాలు చేజర్ల మండలం బిల్లుపాడు గ్రామ పంచాయతీలో టీడీపీ వార్డు సభ్యురాలుగా ఉంది. ఆమె మృతితో కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు శోకసంద్రంలో మునిగిపోయారు.

విద్యుదాఘాతంతో మహిళ...



గంటా గీతాంజలి (ఫైల్)

కావలిరూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ రామచంద్రాపురంలో విద్యుదాఘాతంతో గంటా గీతాంజలి (31) మృతిచెందిన ఘటన సోమవారం వెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మృతురాలి భర్త కృష్ణమూర్తి తిరుణాళ్లలో బొమ్మలు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. గొలగమూడి వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా 5 రోజులుగా ఆలయం వద్ద బొమ్మలు అమ్ముకుంటూ అక్కడే ఉన్నాడు. గీతాంజలి తన 11 ఏళ్ల బిందు లహరి, 10 ఏళ్ల పల్లవితో కలిసి రామచంద్రాపురంలో ఉంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి భార్య, పిల్లలతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఉదయం కుమార్తెలు నిద్రలేసి చూడగా తల్లి గీతాంజలి ఇన్వర్టర్ వద్ద కింద పడిపోయి ఉంది. ఎంత లేపినా లేవకపోవడంతో ఆ విషయాన్ని ఫోన్‌లో తండ్రికి చెప్పారు. దీంతో కృష్ణమూర్తి పక్కనే ఉన్న బంధువులకు ఫోన్ చేసి చెప్పడంతో వారు వచ్చి చూడగా ఒంటిపై, చేతి మణికట్టుకు కాలిన గాయాలు ఉండటంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు గుర్తించి కృష్ణమూర్తికి తెలిపారు. కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ తిరుమల రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోనలో గుర్తు తెలియని మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాపూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచలకోన అటవీశాఖ అతిథిగృహం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సోమవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని చూసి పెంచలకోన పోలీస్ అవుట్‌పోస్టుకు సమాచారమిచ్చారు. దీంతో రాపూరు పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించి, మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు. మృతదేహం సమీపంలో గడ్డి మందు సీసా ఉందని, గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రాపూరు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ వెంకటరాజేష్ కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● కాలిపోయిన నగలు, రూ. 6 లక్షల నగదు



ప్రమాదంలో కాలిపోయిన వంట సామగ్రి

మనుబోలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టువపల్లి దళితవాడలో ఓ పూరిల్లు సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుల కథనం మేరకు.... కాలనీకి చెందిన బత్తల వెంకటకృష్ణయ్య, మమత రేకుల ఇంట్లో నివసిస్తున్నారు. పేదరికం కారణంగా గోడలకు బదులుగా నాలుగు పక్కలా తాటాకు మట్టలు అల్లుకుని ఉన్నారు. బేల్దారి పనులకు వీరిద్దరూ గూడూరుకు వెళుతుంటారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గుర్తించారు. విద్యుదాఘాతానికి తీగల్లోంచి మంటలు చెలరేగి తాటాకు మట్టలకు వ్యాపించాయి. దీంతో ఇంట్లోని బీరువాలో ఉన్న రూ. 2లక్షలు, 6సవర్ల బంగారం కాలి బూడిదయ్యాయని, ఈ ప్రమాదంతో రూ. లక్షల్లో ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు విలపించాడు. సమాచారం అందుకున్న వీఆర్‌వో నాగేశ్వరరావు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

భోగ్యంవారిపల్లిలో శ్రీగంధం చెట్ల దొంగలు

● బెంబేలెత్తుతున్న గ్రామస్థులు



మోడుగా మిగిలిన శ్రీగంధం చెట్టు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 25: జిల్లా కేంద్రానికి శివారు గ్రామమైన భోగ్యంవారిపల్లిలో శ్రీగంధం చెట్ల దొంగల ఆగడాలతో గ్రామస్థులు బెంబేలెత్తుతున్నారు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన భోగ్యం మార్కండేయులు పొలంలోని శ్రీగంధం చెట్లు నరికి చోరీకి పాల్పడ్డారు. రోజు మాదిరిగా సోమవారం పొలానికి వెళ్లిన బాధితుడు చెట్లు నరికి ఉండడం చూసి విస్తుపోయాడు. వారం క్రితం అదే గ్రామానికి చెందిన భోగ్యం కోటయ్య, ఉలవల మురళీకృష్ణ, సుత్తినేని శివరామయ్యల పొలాల్లో ఆరు చెట్లను నరికి తరలించుకొని వెళ్లడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. ఏళ్ల తరబడి కంటికి రెప్పలా కాపాడుకున్న చెట్లు చోరీకి గురికావడంతో బోరున విలపిస్తున్నారు. ఈవిషయమై తమకు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతులు ఫిర్యాదు చేశారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 540

విక్రయానికి సిద్ధంగా గణనాథుల విగ్రహాలు

లింగసముద్రం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : ఈనెల 27వ తేదీన జరగనున్న వినాయకచవితి పండగకు గణనాథుల విగ్రహాలు సిద్ధమయ్యాయి. రాజస్థాన్‌కు చెందిన యువకులు విగ్రహాలను తయారు చేసి, వాటికి అందమైన రంగులు వేసి అమ్మకాలకు సిద్ధం చేశారు. వీరు తయారు చేసిన విగ్రహాలు రూ.7 వేల నుంచి రూ.25 వేల వరకు ఉన్నాయి. ప్రస్తుతం వీరు 63 విగ్రహాలు తయారు చేసి అందుబాటులో ఉంచారు. వాటిని కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.



గణేశ్ ప్రతిమల ఏర్పాటుపై వివాదం

● తిమ్మసముద్రంలో సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ లతీఫున్నీసా చర్చలు విఫలం



గ్రామస్థులు, సర్పంచుతో చర్చిస్తున్న సీఐ, ఎస్‌ఐలు



తిమ్మసముద్రం రామాలయం వద్ద ట్రాకర్లపై ఉన్న గణనాథులు

జలదంకి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవరం పంచాయతీ తిమ్మసముద్రంలో వినాయక విగ్రహాల ఏర్పాటు విషయమై ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. రామాలయం వద్ద ప్రతీ ఏడాది గణేశ్ విగ్రహం ఏర్పాటు చేసి వినాయక చవితిని ఉత్సవాలు జరుపుకునేవారు. ఈ ఏడాది కూడా యువకులు చందాలు వేసుకుని విగ్రహం ఏర్పాటుకు సన్నద్ధమై గణనాథుడిని కూడా గ్రామానికి తరలించారు. అయితే రామాలయం వద్ద తామే విగ్రహాన్ని పెట్టాలని మరోవర్గం పట్టుబట్టడంతోపాటు గణనాథుడి విగ్రహాన్ని సైతం తెచ్చారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం పోలీసు స్టేషన్‌కు చేరింది. దీంతో కలిగిరి సీఐ వెంకటరమణ, జలదంకి ఎస్‌ఐ లతీఫున్నీసా సోమవారం గ్రామానికి చేరుకుని రామాలయం వద్ద ఇరువర్గాలతో చర్చలు నిర్వహించారు. ప్రతీ ఏడాది లాగే ఈ ఏడాది కూడా వినాయక విగ్రహం పెట్టేవిధంగా చేయాలని సర్పంచు రావి ప్రసాద్‌నాయుడు కోరారు. లేనిపక్షంలో రామాలయాన్ని 100 మీటర్లు దూరంలో ఇరు విగ్రహాలు చెరోవైపు ఏర్పాటు చేసుకునేలా చేయాలని సూచించారు. దీనికి టీడీపీ వర్గీయులు ఒప్పుకోకపోగా తామే విగ్రహం పెట్టాలంటూ తేల్చిచెప్పారు. దీంతో వైసీపీకి చెందిన సర్పంచు, అయన అనుచరులు రెండు విగ్రహాలు మీరే పెట్టుకోండంటూ మేము దండిన చందాలు గ్రామస్థులకు వెనక్కు ఇచ్చేస్తామంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారు వెళ్లిన వెంటనే టీడీపీ సానుభూతిపరులు విగ్రహం ఏర్పాటుకు పందిళ్లు వేయడం మొదలుపెట్టడంతో పోలీసులు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే వినాయక విగ్రహాల ఏర్పాటుపై ఏర్పడ్డ వివాదం ఎటు దారితీస్తుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

సంజీవని లాంటిది స్మార్ట్ రేషన్ కార్డు

● ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి



కావలి : గిరిజన మహిళకు స్మార్ట్ రేషన్ కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తదితరులు

కావలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభు త్వం నూతనంగా తీసుకు వచ్చిన స్మార్ట్ రేషన్ కార్డు సంజీవనిలా పనిచేస్తాయని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 6వ వార్డు కొనదిన్నె గిరిజన కాలనీలో సోమవారం ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ, తహసీల్దారు పీ.శ్రావణ్ కుమార్‌తో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ పంపిణీలో అవినీతిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాత రేషన్ కార్డుల స్థానంలో స్మాట్ కార్డులు తీసుకొచ్చిందన్నారు. అనేక సంక్షేమ పథకాలు రేషన్ కార్డుతో ముడిపడి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో రవి, సివిల్‌సప్లై డీటీ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, శ్రీనివాసులు, మొగిలి కల్లయ్య, భాస్కర్‌రెడ్డి, అయేషా, ప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

● **అల్లూరు :** మండలంలోని అన్ని పంచాయతీల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరిగింది. అల్లూరు పట్టణంలోని 1వ నెంబరు రేషన్‌షాపు పరిధిలో తహసీల్దారు లక్ష్మీనారాయణతో కలసి సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఇంటింటికి రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, మేడా కృష్ణారెడ్డి, సామంతుల పరంధామిరెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, అనూరాధ, రాయి నాయుడు, మునిరాజా పాల్గొన్నారు.

● **జలదంకి :** మండలంలోని 17 పంచాయతీలలో ప్రభుత్వ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి క్యూఆర్‌కోడ్‌తో అనుసంధానించిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. జలదంకిలో తహసీల్దారు ప్రమీల, సోమశిలప్రాజెక్ట్ వైస్ చైర్మన్ పీ.మధురెడ్డి, బ్రాహ్మణక్రాకలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, అన్నవరంలో సీబీఆర్ నీటిసంఘం అధ్యక్షుడు పీ.భాస్కర్‌రెడ్డి, కమ్మవారిపాలెంలో జలదంకి పీఏసీఎస్ అధ్యక్షుడు కరియావుల అప్పలయ్యనాయుడులు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు.

● **లింగసముద్రం :** మండలంలోని 11,674 స్మార్ట్ రేషన్ కార్డులను అన్ని గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దారు ఎం కోటేశ్వరరావు, ఆర్ఐ రమణయ్య పర్యవేక్షించారు.

● **వలేటివారిపాలెం :** వలేటివారిపాలెంలో స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దారు నయీంఅహ్మద్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనరసింహం, నాయకులు వలేటి నరసింహం, గుత్తా మహేశ్వరరావు, వలేటి మధుసూదన్‌రావు, కాకుమాను ఆంజనేయులు, ఏఆర్ఐ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● **గుడ్లూరు :** పోట్లూరు ఎస్సీ కాలనీలోని తహసీల్దారు విజయభాస్కర్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అలాగే పోట్లూరు ఓసీ కాలనీలో ఎంపీడీవో వెంకటేశ్వర రావు రేషన్ కార్డు లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నాయకులు పీ.శ్రీనివాసరాజు, ఎస్.కే రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

● **కొండాపురం :** మండలానికి 12,069 స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయని తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. ఆ కార్డు లను కొండాపురంలో ఆయన లబ్ధిదారులకు అందజేశా రు. గుడవళ్లూరులో పోలినేని చంద్రబాబునాయుడు, గరి మెనపెంటలో యారవ కృష్ణయ్య, సాయిపేటలో కుంకు మోహనరావు, భీమవరప్పాడులో విడవలపాటి శ్రీనివాసు లు, మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు, తూర్పుఎర్రబల్లిలో వి.బాల కృష్ణ పంపిణీ చేశారు.

● **ఉలవపాడు :** మండలంలో 17,000 స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టారు. ఫోన్ యాప్ ద్వారా సంబంధిత కార్డుదారులకు ఓటీపీ, ఫేస్, ఐరీష్ ద్వారా ఆన్‌లైన్ నమోదు చేసుకొని కార్డులు పంపిణీ చేస్తున్నారు. అలాగే నూతనంగా సుమారు 1500 మంది లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు.

వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వక్రీకరించారు

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ● కావలి చేరుకున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర



రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, అశోక్‌బాబు తదితరులు

కావలి(టౌన్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వక్రీకరించారని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. మాల జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర సోమవారం కావలికి చేరుకుంది. మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు పర్యవేక్షణలో జరుగుతున్న ఈ యాత్రకు కావలి మాల జేఏసీ ఆధ్వర్యంలో రూపాయి మిద్దె సెంటర్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ట్రంకురోడ్డు మీదుగా యాత్ర నిర్వహించి బ్రిడ్జి కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చింతా మోహన్ మాట్లాడుతూ మాల మాదిగల మధ్య ప్రధాని మోదీ చిచ్చు పెట్టారని ఆరోపించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్‌లో క్రిమిలేయర్‌ను తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని, క్రిమిలేయర్ అనేది ఆర్థిక అసమానతలు రూపుదిద్దేందుకేనని సామాజిక అసమానతలు రూపదిద్దలేవన్నారు. ఈ కార్యక్రమంలో మాల జేఏసీ నాయకులు డీ.చెన్నకేశవులు, ఎం.సుకుమార్, బాలకృష్ణ, జ్యోతి బాలు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం

● **ఉలవపాడు :** ఎస్సీ వర్గీకణతో రాష్ట్రంలో మాలలకు అన్యాయం జరిగిందని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తులిబిలి అశోక్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి మొదలైన ర్యాజ్యాంగ పరిరక్షణ యాత్ర సోమవారం రాత్రి ఉలవపాడుకు చేరుకుంది. మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పీవీరావు విగ్రహంకు పూలమాల వేసి అంబేడ్కర్ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించా రు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రిపబ్లిక్ పార్టీ వ్యవ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ దాసరి చెన్నకేశవులు, మాలల ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, స్థానిక ఉద్యోగులు, దళిత నాయకులు నత్తా నారయ్య, వెలిచర్ల ధనకోటి, దార్ల మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



కొండాపురం : ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో మాట్లాడుతున్న మత్స్యకార సొసైటీ సభ్యులు

కలిగిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ఆలయ ఆస్తుల పరిరక్షణకు కార్యాచరణ రూపొందిస్తు న్నట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని చిన అన్నలూరు పంచాయతీలో సోమవారం జరిగిన వేణు గోపాల స్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసంద ర్భంగా మాట్లాడుతూ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో నియో జకవర్గంలోని ఆలయాల పటిష్టతకు చర్యలు తీసుకుం టామని తెలిపారు. దేవస్థాన చైర్మన్‌గా వేముల ప్రసాద్‌తోపాటు తొమ్మిది మంది సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ.రామారావు, బాసం నరసింహులు నాయు డు, కొండపనాయుడు, మదన్‌కుమార్, గోవిందయ్య, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీ సమస్య పరిష్కరించండి

● **కొండాపురం :** మండలంలోని సాయిపేట పంచాయతీకి చెందిన మత్స్యకారుల సొసైటీ సమస్య పరిష్కరించాలని పంచాయతీ అభివృద్ధి వేదిక సభ్యులు గంటా శ్రీనివాసప్రసాద్, భీమిరెడ్డి అరుణ, టీడీపీ నాయకుడు వల్లూరు వెంకటేశ్వర్లు, మత్యకార సొసైటీ అధ్యక్షుడు కనకయ్య, పలువురు సభ్యులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం వింజమూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పంచాయతీలోని ముస్లిం, మైనారిటీలు, రజకులు, యానాది సామాజిక వర్గానికి చెందిన 150 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అన్ని సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాంద్ర శ్రీహరి, దామా మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

మందబయలు ఆక్రమణలు తొలగించండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేత మధురెడ్డి, కమ్మపాలెం గ్రామస్థులు

జలదంకి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జలదంకి పంచాయతీ పరిధిలోని కమ్మపాలెంలో సర్వే నెంబర్లు 436, 436-ఎ, 455లో 20 ఎకరాలకు పైగా మందబయలు పోరంబోకు భూమి ఆక్రమణలకు గురైందని, దానిని సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పీ.మధురెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం కమ్మపాలెం గ్రామస్థులతో కలసి తహసీల్దారు ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పీ.భాస్కర్‌రెడ్డి, గంటా అశోక్, కుంకు వెంకటేశ్వర్లు, వర్థినేని వెంకటేశ్వర్లు, వర్థినేని బాలయ్యనాయుడు, పులివర్తి సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ కమిటీ ప్రమాణ స్వీకారం

బిట్రగుంట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడుగా చిలకపాటి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు లక్కాకుల మాధవరావు, వాయిల సుధాకర్‌లు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ బోగోలు మండలంలో అనేక పంటల సాగు చేస్తుంటారన్నారు. బిట్రగుంటలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సీఎం సానుకూలంగా స్పందించి స్థల పరిశీలనకై జిల్లా కలెక్టర్‌కు ఆదేశాల పంపించారని తెలిపారు. ప్రమాణస్వీకారం చేసిన వారిని శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నాయకులు దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, మధుబాబు, బీద గిరిధర్ సీపీఎం నేత పులిగడ్ల శ్రీరాములు, బీజేపీ నేతలు కే.బ్రహ్మానందం, ఎస్ఎస్‌యాదవ్, వీ.శ్రీనివాసులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కి ఆరు అర్జీలు

కందుకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 6 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కె.అనూష ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుధ్యం, వీధి దీపాలు, దివ్యాంగుల పింఛన్లు తదితర సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు.

వినాయక మండపాలకు అనుమతి తీసుకోవాలి

ఉలవపాడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాటుకు పోలీసు, విద్యుత్‌శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ అంకమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, వాహన రాకపోకలకు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. గణేషుని నిమజ్జనంలో పోలీసులు సూచించిన మార్గాలనే ఎంచుకోవాలన్నారు.

సిమెంటు బెంచీల వితరణ

కలిగిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారెడ్డిపాలెంలో ప్రయాణికులు, విద్యార్థుల సౌకర్యార్థం సోమవారం పలువురు దాతలు సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ, ఆరోగ్య ఉపకేంద్రం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద గ్రామానికి చెందిన రావుల భాగ్యలక్ష్మి, చాగంటి లక్ష్మీదేవమ్మ, దండా సంపతమ్మ, సుతారు నవీన్, విశ్వాచారి, చాగంటి వెంకటేశ్వర్లు తదితరులు రూ.30వేల విలువగల 10 సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు.

29న టీఆర్ఆర్‌లో మెగా జాబ్‌మేళా

కందుకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈనెల 29న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ కో ఆర్డినేటరు ఇమ్రాజ్‌తో కలిసి సోమవారం ఆయన కళాశాలలో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. పది, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ తదితర కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9848050543, 6301543185ను సంప్రదించాలని కోరారు.

తొలగించిన దివ్యాంగుల పింఛన్ పునరుద్ధరించాలి

కావలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తొలగించిన దివ్యాంగుల పింఛన్ పునరుద్ధరించాలని బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్ కోరారు. ఈ మేరకు బీసీ ఐక్యతభవన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవంగా వైసీపీ ప్రభుత్వంలో సదరన్ సర్టిఫికెట్ల మంజూరులో జరిగిన అవకతవకలపై రీ వెరిఫికేషన్ చేసి అర్హతలేని వారిని తొలగించవచ్చన్నారు. బీసీ ఐక్యతభవన్ నాయకులు ఉరిటి గోవింద్, వరప్రసాద్, దాసరి వెంకటేశ్వర్లు, దివ్యాంగులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

కందుకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనార్దనకాలనీ యానాది సంఘంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బాల్య వివాహాలు, బాల్యగర్భధారణ వలన కలిగే అనర్థాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టరు కారుణ్య, న్యాయవాదులు వసంతలక్ష్మి, ఎం.మనోహర్, కలవకూరి హరిబాబు, పీ.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

కందుకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యతపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని లేకుంటే సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి నష్టపోతారని జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజరు రమేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆర్థికఅక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో హెచ్ఎం నరసింహామూర్తి, హెడ్ కానిస్టేబుల్ బాషా, రిసోర్స్‌ట్రైనర్లు అశోక్, శ్రీను, అనిల్, మీరామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'చవితి' ఉత్సవాలకు విరాళం

కొండాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మిలో ఏర్పాటు చేయనున్న వినాయక మండపానికి కోడె వెంకటరావు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు, టీడీపీ మాజీ కన్వీనర్ చెరుకూరు వెంకటాద్రి సోమవారం రూ.12 వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు విరాళంగా అందచేశారు.

సీనియర్లకు ప్రాతినిధ్యం దక్కేనా?

● నెల్లూరులో నేడు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

కందుకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీలో నియోజకవర్గ నూతన కమిటీలు, అనుబంధ సంఘాలకు నూతన కమిటీలను ఎంపిక చేస్తుండటంతో కందుకూరులో చర్చనీయాంశంగా మారింది. సీనియర్లను, మొదటినుంచి పార్టీలో కష్టపడి పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటున్నారు. అభ్యర్థుల ఎంపికపై నేతల అభిప్రాయాలు సేకరించేందుకు మంగళవారం నెల్లూరులో సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం సహా ఇతర నాయకులకు ఆహ్వానాలు అందాయి. పార్టీలో కొత్త నేతలనూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నప్పటికీ సీనియర్లకూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటున్నారు.



శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు

● జే.మాల్యాద్రి, ఎస్‌ఐ, కొండాపురం

ఈ ఇంటర్వ్యూ

కొండాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏ గ్రామంలోనైనా శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం, పేకాట, కోడిపందేల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం. మద్యం బెల్టు దుకాణాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్‌ఐ జే.మాల్యాద్రి తెలిపారు.

? శాంతిభద్రతలను కాపాడేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! దొంగతనాలు, అల్లర్లు, ఘర్షణలు జరగకుండా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో నిఘా వ్యవస్థను పెంచుతున్నాం. దాతల సహకారంతో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సీసీ కెమోరాలు ఏర్పాటు చేశాం. సర్వీసు సక్రమంగా జరగనందున ఇందులో కొన్ని పనిచేయడం లేదు. మరి కొన్ని గ్రామాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నాం.

? వినాయక చవితి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలా.

! గ్రామాల్లో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి తాత్కాలికంగా వినాయక విగ్రహం ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించే ప్రతీ ఒక్కరూ ముందుగానే అనుమతి తీసుకోవాలి. కమిటీ సరైన ఆధారాలతో స్టేషన్‌కు వచ్చినట్లయితే ఆన్‌లైన్లో నమోదుచేస్తాం. తాము సూచించిన విధంగా నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేసుకొని ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కల్పించకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలి. సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా అనుమతి తీసుకోవాలి.

? మండలంలో నేరాల నమోదు శాతం ఎలా ఉంది.

! మండలంలో నేరాల నమోదు శాతం చాలా తక్కువగానే ఉంది. నెలకు సరాసరిన 10 కేసులు నమోదవుతున్నాయి. అనుకోకుండా జరిగే నేరాలే తప్ప పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని జరిగే నేరాలు లేవు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

● సీపీఎం నేత మోహనరావు



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

కావలి(టౌన్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదలకు జీవో నెంబరు 30 ప్రకారం ఉన్నచోటే ఇళ్లస్థల పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మామిళ్లపల్లి మోహన్‌రావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు లేని పేదలకు రెండు సెంట్ల స్థలం, ఇల్లు మంజూరు చేయాలని కోరారు. దానితోపాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. పేదలకు రెండు సెంట్ల భూమి ఇచ్చేందుకు ప్రభుత్వాలకు మనసు ఒప్పడం లేదని, బడా బాబులకు వేల ఎకరాలు అప్పనంగా కట్టబెడుతున్నారని ఆరోపించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయంలో వసతులు కల్పించి లబ్ధిదారులకు గృహాలు అప్పజెప్పాలన్నారు. ప్రభుత్వం పేదవారికి ఇంటి స్థలాలు గృహాలు ఇచ్చే వరకు దశల వారి పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమోహన్, బీ.కృష్ణయ్య, మేడ వెంకటేశ్వర్లు, జీ.మధుసూదన్‌రావు, ఎస్ వెంకయ్య, రమణయ్య, లక్ష్మయ్య, శైలజ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

క్వారీలో అక్రమాలపై త్వరలో చలో అన్నవరం

● మాజీ మంత్రి కాకాణి

కావలి(టౌన్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అన్నవరం క్వారీలో అవినీతి అక్రమాలు వెలికి తీసేందుకు చలో అన్నవరం కార్యక్రమానికి శ్రీకారం చుడతామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ పీ.చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ క్వారీలో అక్రమాలను సాక్ష్యాలతో తెలుసుకునేందుకు ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రయత్నిస్తే అక్రమంగా హత్యాయత్నం కేసు పెట్టడం ప్రజల దృష్టి మరల్చేందుకేనన్నారు. మనీ స్కామ్ నిర్వాహకుడు సుభాని వద్ద ఎవరి వాటా ఎంతో, సూత్రధారులు ఎవరు బయటకు వస్తాయన్నారు. చలో అన్నవరం కార్యక్రమం తేదీని మంగళవారం ఖరారు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కాకాణి కుమార్తె వైసీపీ రీజియన్ మహిళా అధ్యక్షురాలు పూజిత, నాయకులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ

కందుకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవూరులో సోమవారం హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ కంట్రోల్ యూనిట్‌ల ఆధ్వర్యంలో మదర్‌ల్యాండ్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూ సునీత, పీఈ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



శేషాచలంలోకి పులుల ప్రవేశం?



ఇన్నాళ్లు జాడలేని పులి శేషాచల అడవుల్లోకి అడుగుపెట్టిందా..? దీనికి అవుననే సమాధానం చెబుతున్నారు అటవీశాఖ అధికారులు. కడప జిల్లా చిట్వేలి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్న దృశ్యాలు ట్రాప్ కెమెరాల్లో నమోదు కావడంతో ఈ అభిప్రాయానికి వస్తున్నారు. ఒకటి కాదు.. రెండో మూడో పులులు శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు నుంచి నల్లమల శేషాచలం కారిడార్ ద్వారా చిట్వేలి ప్రాంతానికి చేరుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. ఇవి శేషాచలం అడవుల్లోకి కూడా అడుగుపెట్టి ఉంటాయని అంచనా వేస్తున్నారు.



జస్ట్.. సరదాగా పంచ్..

ఈ చిత్రంలో ఒకరు కలెక్టర్ వెంకటేశ్వర్ కాగా అటు తలపడుతున్న రెండో వ్యక్తి శాప్ చైర్మన్ రవినాయుడు. నిత్యం వివిధ కార్యక్రమాల్లో తీరిక లేకుండా గడిపే వీరికి బాక్సింగ్ ఆడటానికి సమయమెక్కడ దొరికిందనుకుంటున్నారా.. అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో భాగంగా సోమవారం ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఇండోర్ హాలులో బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన వీరిద్దరూ బాక్సింగ్ పంచ్‌లు విసురుకుంటున్నట్లుగా సరదాగా కాసేపు ముచ్చటకలిగించారిలా..



మున్సిపల్ అదనపు కమిషనర్ రిలీవ్

తిరుపతి, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డిని రిలీవ్ చేస్తూ కమిషనర్ మౌర్య సోమవారం ప్రొసీడింగ్స్ ఇచ్చారు. మాతృశాఖ స్టేట్ ఆడిట్ విభాగంలో రిపోర్ట్ చేయాలని అందులో పేర్కొన్నారు. అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న చరణ్‌తేజ్ ఎన్నికల బదిలీల్లో భాగంగా తిరుపతి ఏడీసీగా డిప్యుటేషన్‌పై వచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి 7న రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీల్లో భాగంగా మాతృ సంస్థకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఉన్నతాధికారుల అనుమతితో ఏడీసీగా కొనసాగుతూ వచ్చారు. సోమవారం మంత్రి నారాయణ రావడంతో పలువురు టీడీపీ నేతలు ఈ వ్యవహారాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిసింది. ఆయన ఆదేశాల మేరకు చరణ్‌తేజ్‌ను రిలీవ్ చేసినట్టు సమాచారం.

అధ్యక్ష పదవికి పోటాపోటీ

కొనసాగేందుకు ఆసక్తి చూపుతున్న నరసింహ యాదవ్

మార్చే పక్షంలో అవకాశం కోసం శ్రీధర వర్మ పట్టు

నేడు టీడీపీ పార్లమెంటు కమిటీపై సమావేశం

తిరుపతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టీడీపీ పార్లమెంటు కమిటీ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ నెలకొంది. వివిధ సమీకరణాలతో పలువురు నేతలు రేసులో ఉన్నారు. ఎవరికి వారు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రేణిగుంట మైకన్వెన్షన్ హాలులో జరిగే టీడీపీ పార్లమెంటు విస్తృత స్థాయి సమావేశంపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుత అధ్యక్షుడు నరసింహయాదవ్ మరోసారి అధ్యక్ష పదవిలో కొనసాగాలని భావిస్తున్నా గట్టిగా పట్టుబట్టడం లేదు. ఆయననే కొనసాగించాలని నిర్ణయిస్తే సమస్యే లేదు. మారిస్తే మాత్రం గట్టి పోటీ ఏర్పడుతుంది. నామినేటెడ్ పదవులేవీ లభించని మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ఈ పదవి తనకు వస్తుందని నమ్ముతున్నారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి కూడా ఆశిస్తున్నారు. అధ్యక్ష రేసులో ఉన్న అదే సామాజిక వర్గ సీనియర్ నేత సూరా సుధాకర్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మద్దతు ఇస్తున్నట్టు సమాచారం. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, మాజీ మంత్రి పరసా రత్నం, గురవారెడ్డి(శ్రీకాళహస్తి), రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం కూడా పోటీ పడుతున్నారు. కుల సమీకరణ లెక్కలు వేసుకుంటున్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు పేరు తెరపైకి వచ్చినా తెలుగు యువత రాష్ట్ర అధ్యక్ష పదవి కేటాయించే అవకాశముందని సమాచారం.

సమతూకం పాటించాలి

పార్లమెంటు కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల పదవుల ఎంపికలో సామాజికవర్గాలు, నియోజకవర్గాలకు సమతూకం వేయాలని అధిష్ఠానం ఆదేశించినట్టు తెలిసింది. ఈ మేరకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందంటున్నారు. అధ్యక్ష పదవి ఒక వర్గానికి ఇస్తే ప్రధాన కార్యదర్శి మరో వర్గానికి కేటాయించాల్సి ఉంటుంది. ప్రధాన పదవులను నియోజకవర్గానికి ఒకటి దక్కేలా జాగ్రత్త పాటించాలి. కమిటీలోనూ, అనుబంధ విభాగాల్లోనూ తప్పనిసరిగా యువత, మహిళలకు 33 శాతం వంతున పదవులు కేటాయించాలని భావిస్తున్న క్రమంలో వారి ప్రాతినిధ్యం పెరిగే అవకాశముంది. కాగా పదవికి కనీసం మూడు దరఖాస్తులు ఉండాలని అధిష్ఠానం త్రీ మెన్ కమిటీని ఆదేశించినట్టు చెబుతున్నారు. వచ్చే నెల 3వ తేదీలోపు కమిటీలు ఖరారు కావాలని నిర్ణయించిన నేపథ్యంలో తిరుపతి పార్లమెంటు కమిటీపై ఈ నెలాఖరులోపే ప్రకటన వెలువడనుంది.

హథీరాంజీ మఠం విషయంలో

కమిటీదే తుది నిర్ణయం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం భవనం కూల్చివేతపై నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీదే తుది నిర్ణయమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఈ విషయంపై సమీక్షించారు. భవనాన్ని ప్రత్యక్షంగా పరిశీలించామని, పగుళ్లు ఏర్పడిన ప్రాంతాల్లో పునర్నిర్మాణం, కూల్చివేతపై కమిటీ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. మఠం పునరుద్ధరణ విషయంలో తిరుపతి ఐఐటీ నిపుణులకు లేఖ రాశామని, త్వరలోనే స్పష్టత వస్తుందని తెలిపారు.


సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్

నూతన కమిటీ ఏర్పాటు

హథీరాంజీ మఠం భవన సముదాయం కూల్చివేత, పునర్నిర్మాణంపై కలెక్టర్ వెంకటేశ్వర్ నేతృత్వంలో నూతన కమిటీ ఏర్పడింది. ఇందులో నగరపాలక సంస్థ కమిషనర్, ఎమ్మెల్యే, ఐఐటీ ప్రతినిధులు, బంజార సంఘం ప్రతినిధులు, రాజకీయ పార్టీ నేతలు సభ్యులుగా ఉంటారు.

రేపు స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా స్విమ్స్ ఓపీ, ఓటీలకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని, ప్రజలు, రోగులు సహకరించాలని కోరారు.

శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి ప్రశంసల జల్లు

● ఎన్‌పీఎం సేవలపై కేంద్ర బృందం కితాబు

శ్రీకాళహస్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సిజేరియన్ కాన్పులను కట్టడి చేసే క్రమంలో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో అందిస్తున్న సేవలపై కేంద్ర బృందం, యూనిసెఫ్ ప్రతినిధులు ప్రశంసల జల్లు కురిపించారు. యూనిసెఫ్ రాష్ట్ర ప్రతినిధి నాగేంద్ర పర్యవేక్షణలో నర్స్ ప్రాక్టిషనరీ మిడ్‌వైఫ్(ఎన్‌పీఎం) సేవలందిస్తూ ఇక్కడి ప్రభుత్వాస్పత్రి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన కేంద్ర బృందం, యూనిసెఫ్ ప్రతినిధులు సోమవారం ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఇక్కడి ఎన్‌పీఎం విభాగం అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. ఓపీలో గర్భిణులకు చేస్తున్న ఎన్‌పీఎంలు పరీక్షలతోపాటు వ్యాయామాలు, మ్యూజిక్ థెరపీ, కౌన్సెలింగ్ ఇస్తున్న తీరుపై ఆరా తీశారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఈ పద్ధతులు అమలు చేసేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర యూనిసెఫ్ ప్రతినిధి నాగేంద్ర మాట్లాడుతూ గర్భం దాల్చిన తొలిరోజుల్లో ఎన్‌పీఎం విభాగాన్ని ఆశ్రయిస్తే మూడు త్రైమాసికాల్లో వ్యాయామాలు, యోగాలకు సంబంధించి శిక్షణ ఇస్తారన్నారు. పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తూ సానుకూలమైన శస్త్రచికిత్స నిర్వహిస్తారన్నారు. అనవసర మందులు వాడకుండా, శాస్త్రీయ విధానాలతో సహజసిద్ధంగా హార్మోన్ల ఉత్పత్తి ద్వారా సుఖప్రసవం సునాయాసంగా జరిగేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ మణిని ఆయన అభినందించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ భారతీ శర్మ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వీణా, రీసెర్చ్ అసోసియేట్లు మౌనిక, నీరల్ పటేల్, ఆస్పత్రి ఆర్‌ఎంవో విజయలక్ష్మి, సీనియర్ గైనకాలజిస్టు హరిప్రియ, నర్సింగ్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.


కాన్పుల వార్డులో టీవీ ద్వారా వ్యాయామాలపై అవగాహన కల్పిస్తున్న అధికారి

మెగా సిటీగా తిరుపతి

స్కావెంజర్స్ కాలనీవాసులకు అక్కడే అపార్ట్‌మెంట్లు

జూన్‌లోపు తుడా టవర్స్ పూర్తి

మున్సిపల్, తుడా అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ

తిరుపతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతిని మెగా సిటీగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని, ఇందులో భాగంగానే మహానగరం చేయాలని సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ, తుడా అభివృద్ధి పనులపై సోమవారం తుడా కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. తుడా టవర్స్‌లోని ఫ్లాట్లు, దుకాణాలపై వచ్చే ఆదాయ, వ్యయాలపై తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, వీసీ శుభం బన్సల్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. నగరపాలక సంస్థలో పారిశుధ్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కార్మికులకు కల్పించాల్సిన వసతులపై కమిషనర్ ఎన్.మౌర్య వివరించారు. టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేసి తుడా ఆదాయాన్ని పెంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తుడా, నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అన్నారు. జూన్‌లోపు తుడా టవర్స్‌ను పూర్తిచేయాలని చెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో స్కావెంజర్స్ కాలనీ వాసుల పరిస్థితి చూసి ఎంతో బాధ కలిగిందని, వారికి 8 నెలల్లోనే అపార్టుమెంట్లు కట్టిస్తామని అన్నారు. తిరుపతి, తణుకులో టీడీఆర్ బాండ్ల జారీలో గోల్‌మాల్‌పై విచారణ జరుగుతోందన్నారు. కమిటీ ద్వారా పరిశీలించి అర్హులైన వారికి జారీ చేస్తున్నామన్నారు. శెట్టిపల్లి భూముల సమస్యను త్వరలోనే పరిష్కరించనున్నామన్నారు. ఈ సమావేశంలో ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ, తుడా వీసీ శుభం బన్సల్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు కృష్ణారెడ్డి, శ్యాంసుందర్, టీడీపీ నేతలు బీఎల్ సంజయ్, పుష్పావతి యాదవ్, ఊట్ల సురేంద్రనాయుడు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

పరమసముద్రం చెరువు చేరిన

కృష్ణా జలాలు


కుప్పం మండలం పరమసముద్రం చెరువు సమీపంలో పరవళ్లు తొక్కుతున్న హంద్రీ-నీవా కాలువ

కుప్పం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పంప్ హౌస్‌నుంచి విడుదలైన కృష్ణాజలాలు,ఈనెల23తేదీ అర్ధరాత్రికి రామకుప్పం మండలం వర్దికుప్పం వద్ద కుప్పం నియోజకవర్గంలో ప్రవేశించాయి. అక్కడినుంచి 24వ తేదీ మధ్యాహ్నానికి శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెకు చేరుకున్నాయి. ఇక అక్కడినుంచి శాంతిపురం మండలం సోమాపురం ద్వారా గుడుపల్లె మండలం పాపానూరుకు, అక్కడినుంచి జరుగు గ్రామం ద్వారా సోమవారం మధ్యాహ్నానికి కుప్పం మండలంలోకి కృష్ణా జలాలు వడివడిగా ప్రవహించాయి. ఇదే రోజు రాత్రికి అంతిమ స్థానమైన కుప్పం చెరువుకు చేరడంతో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువ సాగించిన 123.64 కిలోమీటర్ల ప్రయాణం ముగిసింది. ఇక నిండాల్సింది- కుప్పం, పలమనేరు నియోజకవర్గాల పరిధిలోని 110 చెరువులు మాత్రమే.

కుప్పంవాసుల కల నెరవేరింది : కుప్పం వాసుల చిరకాల కల నెరవేరిన సందర్భమిది. ఎక్కడి శ్రీశైలం ప్రాజెక్ట్.. ఎక్కడి కుప్పం... ఆరేడువందల కిలోమీటర్ల దూరంనుంచి కృష్ణమ్మ బిరాబిరా వచ్చి కుప్పం ఒడి చేరిన ఆనందం అన్నదాతది. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం సాకారమైంది. ఒక్క కుప్పం బ్రాంచి కాలువ నిర్మాణానికే ఏకంగా రూ.560 కోట్లు వ్యయం చేశారు.ఇందులో వైసీపీ ప్రభుత్వంలో చేసింది నామమాత్రమే. అప్పట్లో నీళ్ల విడుదల చేసేశామంటూ జగన్ ఆడిన డ్రామాలు నవ్వులపాలయ్యాయి.2024లో అధికారంలోకి రాగానే ఎక్కడివక్కడ నిలిచిపోయిన హంద్రీ-నీవా కాలువ నిర్మాణ పనులకు నిధులు విడుదల చేసి వేగం పెంచి అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్తి చేయించి కుప్పానికి కృష్ణా జలాలను రప్పించగలిగారు.నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కాలువ గట్టు పొడవునా ప్రవహిస్తున్న గంగమ్మను చూస్తూ కేరింతలు కొడుతున్న కుప్పం అన్నదాతలోని ఆనందం ఎనలేనిది, వెలలేనిది కూడా.ముఖ్యమంత్రి చంద్రబాబు.. కుప్పం నియోజకవర్గ ప్రజల జీవితాల్లో కృష్ణా జలాల ద్వారా వెలుగులు పూయించారు. వారి భవిష్యత్తుకు బంగారుబాటలు వేశారు. ఇది టీడీపీ నేతలు అంటున్న మాటలు కాదు. నియోజకవర్గంలో ఇప్పుడు ఏ పల్లెకు వెళ్లినా, ప్రజల నోళ్లలో నానుతున్న మాటలివి.

తుది దశకు డీఎస్సీ ప్రక్రియ

ఎల్లుండి నుంచి అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

● నేటినుంచి కాల్ లెటర్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,478 టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఈనెల 22వ తేదీన అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదలైన విషయం తెలిసిందే. ఈ జాబితా ఆధారంగా రాష్ట్ర విద్యాశాఖ సూచనలతో గురువారం నుంచి చిత్తూరులో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రారంభిస్తారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి మెగా డీఎస్సీ-2025 లాగిన్ ఐడీల ద్వారా అభ్యర్థులు తమ కాల్‌లెటర్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి.. పరిశీలనకు 30 బృందాలు

అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. చిత్తూరులోని అపోలో, ఎస్వీసెట్ కళాశాలలను ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు వేదికలుగా నిర్ణయించారు. గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ సమయం, వేదికకు హాజరు కావాల్సి ఉంది. హాజరు కాని, అర్హత లేని అభ్యర్థిత్వం రద్దు చేయనున్నారు. అటువంటి సమయంలో తదుపరి మెరిట్ జాబితాలోని అభ్యర్థిని సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలవనున్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు 30బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఎంఈవో, హెచ్‌ఎం,రెవెన్యూడీటీ, మండల ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సిబ్బంది ఉంటారు.ఒక్కో బృందం కేవలం 50 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన మాత్రమే చేస్తుంది. ఏ అభ్యర్థి, ఏ బృందం వారి వద్ద ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేసుకోవాలనే వివరాలు వారి మొబైల్‌కు రాష్ట్ర విద్యాశాఖ సమాచారం పంపుతుంది. ఈ బృందాల పర్యవేక్షణకు పది బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందంలో డిప్యూటీ డీఈవో, ఇద్దరు ఎంఈవో/హెచ్‌ఎంలు ఉంటారు. మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థి పూర్తి సమాచారాన్ని రాష్ట్ర విద్యాశాఖ ఇప్పటికే జిల్లా విద్యాశాఖ లాగిన్‌కు పంపింది. కేవలం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావడం వల్ల అభ్యర్థికి ఎలాంటి ఎంపిక హక్కు కలుగదు. ఎంపిక పూర్తిగా మెరిట్, అర్హత, రిజర్వేషన్, నియమనిబంధనల ఆధారంగానే ఉంటుందని విద్యాశాఖ ప్రకటించింది. ఎవరైనా అభ్యర్థులు నకిలీ/తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించారని తేలితే క్రిమినల్ చర్యలుతీసుకునే అవకాశం ఉంది.

ధ్రువీకరణ పత్రాలిలా..

● అభ్యర్థులు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, అంగవైకల్యం ధ్రువీకరణ పత్రం, పోస్టుకు సంబంధించిన అర్హతల ఆధారంగా ఒరిజినల్ సర్టిఫికెట్లుతోపాటు అన్నీ స్కాన్డ్‌కాపీలను తయారు చేసుకోవాలి. ● అప్లోడ్ చేసిన సర్టిఫికెట్ల అన్నీ మూడు సెట్ల జెరాక్స్ కాపీలను తీసుకుని గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించుకుని రావాలి ● ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను తేవాలి ● అభ్యర్థులు వ్యక్తిగత లాగిన్‌లో అవసరమైన సర్టిఫికెట్ల స్కాన్డ్ కాపీలను వెరిఫికేషన్ రాకముందే మెగా డీఎస్సీ 2025 లాగిన్‌లో అప్లోడ్ చేసి ఉండాలి.

ఉమ్మడి చిత్తూరు జిల్లా రోస్టర్‌లో పోస్టుల మేనేజ్‌మెంట్ల వారీగా వివరాలు

కేటగిరీ	ప్రభుత్వ, స్థానిక యాజమాన్యం	మున్సిపల్	మున్సిపల్ కార్పొరేషన్	మొత్తం
ఓసీ	511	26	41	578
బీసీ-ఎ	94	6	11	111
బీసీ-బీ	127	5	7	139
బీసీ-సీ	18	1	0	19
బీసీ-డీ	91	5	6	102
బీసీ-ఈ	48	2	3	53
ఎస్సీ-గ్రేడ్ 1	16	1	4	21
ఎస్సీ-గ్రేడ్ 2	84	4	6	94
ఎస్సీ-గ్రేడ్ 3	102	4	6	112
ఎస్టీ	85	5	5	95
ఈడబ్ల్యూఎస్	125	5	8	138
పీహెచ్-విజువల్	1	0	0	1
పీహెచ్-హియర్	10	0	0	10
ట్రైబల్‌వెల్ఫేర్ (ఆశ్రమ)	5	0	0	5
	1317	64	97	1478

సిటీ విజిటర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ యాప్ ప్రారంభం



యాప్ గురించి వివరిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో భద్రతను మరింత పటిష్టం చేసేందుకు రూపొందించిన సిటీ విజిటర్ ఇన్ఫర్మేషన్ రికార్డు మేనేజ్‌మెంటు సిస్టమ్ (స్విరిమ్స్) యాప్‌ను సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన రాజు ఆవిష్కరించారు. దీనిద్వారా తిరుపతికి రోజుకు ఎంతమంది వస్తున్నారు? ఎక్కడ దిగుతున్నారు అనే వివరాలు తెలుస్తాయన్నారు. హోటళ్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తున్నామని, యాత్రికుల ఆధార్ కార్డు, అడ్రస్‌లు, లైవ్ ఫొటోలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువుల పూర్తి వివరాలు సేకరిస్తామని అన్నారు. ఇలా చేయడం వల్ల అసాంఘిక శక్తులను సులువుగా గుర్తించగలుగుతామని తెలిపారు.



మంత్రి నారాయణ - జస్టిస్ సందేశ్ - జస్టిస్ జోషి - జస్టిస్ ఎంకె థాక్కెర్ - జయం రవి - మాధవి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర మంత్రి నారాయణ, ఎంపీ మాగుంట శ్రీనివాసులు, తమిళ సినీ హీరో జయం రవి(రవిమోహన్), గాయని కెనిషా ఫ్రాన్సిస్, చిరంజీవి సోదరి మాధవి ఉన్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హెచ్‌పీ సందేశ్, జస్టిస్ సీఎం జోషి, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే థాక్కెర్ కూడా స్వామిని దర్శించుకున్నారు.

సర్వ దర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం : రూ.4.02 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 72,119

తలనీలాలు సమర్పించినవారు : 25,294

ఆడుదాం ఆంధ్రాకు రూ.119కోట్లు దారపోశారు

29న స్పోర్ట్స్ అకాడమీలపై ప్రకటన

శాప్ చైర్మన్ రవినాయుడు



తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు రూ.119 కోట్లు కేటాయించి, దుర్వినియోగం చేశారని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆరోపించారు. నిధులు పూర్తిగా పక్కదారి పట్టినట్లు విచారణలో తేలిందని అన్నారు. అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలలో భాగంగా సోమవారం ఉదయం ఎస్వీక్యాంపస్ హైస్కూల్ మైదానంలో విలువిద్య పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో క్రీడా అకాడమీలు రద్దు చేసిందని, వాటిని మళ్లీ ప్రారంభిస్తామని, క్రీడా పాఠశాలల సంఖ్య పెంచుతామని, ఇంటర్ వరకు మంచి శిక్షణ ఇవ్వడానికి కృషి చేస్తామని వివరించారు. అమరావతి చాంపియన్‌షిప్‌లో పది క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. కేవలం రూ.కోటిన్నర నిధులతో క్రీడాకారులకు నాణ్యమైన పరికరాలు, సదుపాయాలు కల్పించామన్నారు. ప్రతి జిల్లాలోనూ క్రీడాకారులను గుర్తించి జోనల్, రాష్ట్రస్థాయి వరకు తెచ్చామని, విజేతలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని అన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా జాగ్రత్తపడ్డామన్నారు. ఒలింపిక్స్‌లో ఆంధ్రా క్రీడాకారులు మెడల్స్ సాధించాలనే లక్ష్యంతో కార్యాచరణ చేశామని స్పష్టం చేశారు. విజయవాడకు చెందిన విలువిద్య క్రీడాకారులు కె.ఝాన్సీలక్ష్మి, టి.భువనరాజేశ్వరి, కె.యుక్తశ్రీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఆడే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉందన్నారు. ఇక్కడే గట్టిపోటీ ఎదుర్కొనే అవకాశం లభించిందని, తద్వారా జాతీయ స్థాయి పోటీలు సులభమవుతాయని పేర్కొన్నారు. సాయంత్రం టీటీడీ బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి క్రీడా మైదానాలను సందర్శించారు. క్రీడాకారులతో ముచ్చటిస్తూ చక్కగా రాణించాలని ఆకాంక్షించారు. కాగా ఐదు వేదికల్లో పది క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. మంగళవారం అంతిమ ఫలితాలు రానున్నాయి.

పోలీసు 'పీజీఆర్‌ఎస్'కు 106 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 106 ఫిర్యాదులు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో ముక్కంటి ఆలయ సిబ్బంది దురుసు ప్రవర్తన

శ్రీకాళహస్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ సిబ్బంది తీరుతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం సిబ్బంది అనుసరించిన తీరు విమర్శలకు దారితీసింది. భక్తులకు అంతరాలయ దర్శనం చేరువ చేసేందుకు రూ.500 టిక్కెట్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీనికోసం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద నుంచి చెక్క మెట్లపై క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ కాశీ అనే ఒప్పంద ఉద్యోగి టిక్కెట్లను తనిఖీ చేస్తుంటాడు. సోమవారం కొందరు మహిళా అధికారులు అంతరాలయ దర్శనానికి వెళుతుండగా కాశీ మెట్లపై అడ్డంగా కూర్చున్నాడు. వారు పక్కకు జరగాలని కోరడంతో ఆగ్రహంతో పోతేపోండి అంటూ దురుసుగా ప్రవర్తించాడు. అలాగే కొందరు అర్చకులు హారతి పళ్లేలతో క్యూ వద్దనే అడ్డంగా నిలబడి దక్షిణ సమర్పిస్తేనే హారతి ఇస్తూ భక్తుల పట్ల కస్సుబుస్సులాడారు. అలాగే అమ్మవారి సన్నిధిలోనూ కొందరు సిబ్బంది దళారులకు రాచబాట వేస్తున్నారు. ఇక అక్కడ పనిచేసే ఓ ఉద్యోగి దురుసుగా వ్యవహరించడంపై సోమవారం పలువురు భక్తులు విస్మయం చెందారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మూడు నెలల గడువు ఇచ్చిందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్‌కు లేఅవుటు రెగ్యులైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి, సమీప ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు అధికంగా ఉన్నాయని, ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

మారథాన్‌లో రామకృష్ణ ప్రతిభ



హైదరాబాదులో జరిగిన హాఫ్ మారథన్‌లో రామకృష్ణ

చంద్రగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కల్యాణీ డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల సీఐ రామకృష్ణ ఈనెల 24న జరిగిన మారథాన్‌లో విశేష ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లో జరిగిన హాఫ్ మారథన్ పోటీల్లో ఆయన 1.45 గంటల్లో 21 కిలోమీటర్ల పరుగెత్తారు. గతం కంటే ఈసారి ఐదు నిమిషాలు ముందుగా లక్ష్యాన్ని చేరుకున్నారు. అమెరికాలోని బోస్టన్ జరిగే మారథన్‌లో పాల్గొనేందుకు రామకృష్ణ పట్టుదలతో సాధన చేస్తున్నారు. ఇప్పటికే దేశంలో వివిధ ప్రధాన కేంద్రాలలో జరిగిన మారథాన్ పోటీల్లో పాల్గొన్నారు. బోస్టన్ పోటీలో పాల్గొనాలంటే 3 గంటల్లో 42 కిలోమీటర్లు చేరుకోవాల్సి ఉంటుందని, ఇప్పటికన్నా మరింత మెరుగుపడేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వీఆర్‌కు ఎస్‌ఐ గిరిబాబు

తిరుపతి(నేర విభాగం) ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ ఎస్‌ఐ గిరిబాబును వీఆర్‌కు పంపుతూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎయిర్‌బైపాస్ ఘటనలో వైఫల్యంతో పాటు పలు కారణాలతో బదిలీ చేస్తున్నట్లు ఎస్పీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన పనితీరు, వ్యవహారశైలిపై విచారణకు ఆదేశించారు.

మేము దివ్యాంగులమే..పెన్షన్ రద్దు చేయకండి

కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు పోటెత్తిన ప్రత్యేక ప్రతిభావంతులు - ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): 'మేమంతా దివ్యాంగులమే.. కొంతమంది నడవలేని స్థితిలో ఉన్నారు.. మరి కొందరు కదల్లేని స్థితిలో ఉన్నారు.. వందశాతం వికలత్వం ఉన్నా 40 శాతానికి తగ్గించి పింఛన్లు రద్దు చేస్తామంటూ నోటీసులు పంపారు. మా కడుపు కొట్టకండి' అంటూ పలువురు దివ్యాంగులు కలెక్టర్ వెంకటేశ్వర్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు దివ్యాంగులు పెద్దయెత్తున రావడంతో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, జిల్లా వైద్యశాఖాధికారి బాలకృష్ణనాయక్ వారినుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్‌ఎస్‌కు మొత్తం 321 అర్జీలు అందగా అందులో రెవెన్యూ శాఖకు 151 ఉన్నాయి.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రీ వెరిఫికేషన్‌లో అన్యాయం చేశారు



ప్రమాదంలో వెన్నెముక దెబ్బతింది. మంచానికే పరిమితమయ్యా. ఇటీవల మా ఇంటికి వైద్యబృందం వచ్చి 89శాతం ఉన్న వికలత్వాన్ని 49శాతం మాత్రమే ఉందని రాశారు. దీంతో రూ.15వేలు వచ్చే పింఛను రూ.6వేలు చేశారు. వైద్యబృందం అన్యాయం చేసింది.. మీరైనా న్యాయం చేయండి.

- కార్తికేష్, నారాయణవనం

నా భూమిని వేరేవారి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు



వంశపారంపర్యంగా ఆలత్తూరు రెవెన్యూ లెక్కదాఖల్లో 2.60ఎకరాలు కలిగి ఉన్నాను. ఈ భూమిని వీఆర్వో, రెవెన్యూ అధికారులు నాకు తెలియకుండా వేరే ఇద్దరి పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీనిపై రెవెన్యూ సదస్సులోనూ ఫిర్యాదు చేశాను. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. మీరైనా న్యాయం చేయండి.

- చెంగారెడ్డి, ఆలత్తూరు, బీఎన్‌కండ్రిగ

వికలత్వం తక్కువగా ఉందని పింఛను తొలగిస్తామన్నారు..



ఎన్నో ఏళ్లుగా నడవలేని స్థితిలో ఉన్నాను. రూ.6వేలు పింఛను వచ్చేది. రీ వెరిఫికేషన్ పేరుతో వికలత్వాన్ని 40శాతం కంటే తక్కువగా చేయడంతో పింఛను తొలగించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పింఛను రద్దు చేయడం దుర్మార్గం. పునఃపరిశీలన చేయండి.

- లక్ష్మీనారాయణ, దివ్యాంగుడు, సప్తగిరికాలనీ, మంగళం

తొలగించిన పింఛన్లను పునరుద్ధరించండి



కలెక్టరేట్ ఎదుట వికలాంగుల ఆందోళన

తొలగించిన దివ్యాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం జాతీయ వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్లు తొలగించి వారి గొంతుకోసే ప్రయత్నం చేస్తోందన్నారు. తిరుపతి జిల్లాలో రీవెరిఫికేషన్ పేరుతో 25వేల మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రీవెరిఫికేషన్ పేరుతో తప్పుడు ధ్రువపత్రాలు ఇచ్చిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు.

చిన్నతనంలోనే రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి



పోలియో కారణంగా చిన్నపుడే రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. రూ.70 నుంచి పింఛను అందుకుంటున్నాను. 90శాతం వైకల్యం ఉన్నా వైద్యులు రీవెరిఫికేషన్ పేరుతో వికలత్వం తగ్గించారు. ఇలా చేయడం సబబుకాదు. పునఃపరిశీలించి పింఛను అందజేయాలి.

- శ్రీనివాసులు, తిరుపతి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. రూ.6,400కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరారు. ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలు రాయాలని విద్యార్థులను యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయన్నారు. సెలవు రోజుల్లోనూ ప్రైవేటు విద్యాసంస్థలు తరగతులు నిర్వహించి విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని తెలిపారు. తిరుపతి, చంద్రగిరిలో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, వర్సిటీలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.





హెల్ప్‌డెస్క్‌లో దివ్యాంగులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

వింగ్‌టెక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

వింగ్‌టెక్ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. చైనాకు చెందిన వింగ్‌టెక్ యాజమాన్యం ప్రభుత్వానికి ఇచ్చిన హామీకి భిన్నంగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలేదని ఆరోపించారు. పూర్తిస్థాయిలో రాయితీలు పొంది ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు, పన్నులు చెల్లించకపోగా కార్మికులకు ద్రోహం చేస్తోందని వివరించారు. ఈ మేరకు కలెక్టర్‌కు విన్నవించారు. అదేవిధంగా సమస్యలను పరిష్కరించాలని ఏపీ రజకవృత్తిదారుల సంఘం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సంఘ నాయకులు కోరారు.



ఆందోళన చేస్తున్న వింగ్‌టెక్ పరిశ్రమ ఉద్యోగులు

ఏడు ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడిన ఎర్రచందనంతో ఫారెస్టు అధికారులు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. సోమవారం తెల్లవారుజామున ఎల్లమంద వై-జంక్షన్ వద్ద ఫారెస్టు సిబ్బంది కాపు కాచి ఉన్నారు. అదే సమయంలో ఉస్తికాయలపెంట నుంచి అతివేగంగా ఓ కారు రావడాన్ని గుర్తించారు. ఆపేందుకు విఫలయత్నం చేసి వెంబడించారు. దీంతో కొంతదూరంలో కారును చెట్ల మధ్య ఆపి ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. కారులో పరిశీలించగా 160 కేజీల బరువున్న ఏడు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.8 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. దాడిలో రేంజ్ ఆఫీసర్ వెంకటరమణతోపాటు సిబ్బంది మునిస్వామి నాయక్, లక్ష్మీప్రసాద్, సదాశివయ్య, రాజేష్ కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ, ఆదాయ పన్నులపై అవగాహన అవసరం

ఎప్పటికప్పుడు మార్పులను తెలుసుకోవాలి ● జీఎస్టీ అదనపు కమిషనర్ శర్మ



ట్యాక్స్ ప్రాక్టీషనర్ల అవగాహన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శర్మ తదితరులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో రోజురోజుకూ మారుతున్న జీఎస్టీ విధానాలు, ఆదాయ పన్ను చెల్లింపుల్లో ఉన్న లొసుగులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని జీఎస్టీ అదనపు కమిషనర్ శర్మ సూచించారు. తిరుపతిలోని ఒక ప్రైవేటు హోటల్‌లో సోమవారం రాష్ట్ర, జిల్లా స్థాయి ఆడిటర్లు, ట్యాక్స్ ప్రాక్టీషనర్ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ శిరీష మాట్లాడుతూ తాను డాక్టర్‌గా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ కొత్త విధానాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జీఎస్టీ అదనపు కమిషనర్ శర్మ మాట్లాడుతూ ఆడిటర్లు, ట్యాక్స్ ప్రాక్టీషనర్లు రిటర్నులు దాఖలు చేయడం, ట్యాక్స్ పే చేయడానికి అవసరమైన విధానాలపై, టెక్నాలజీపై అవగాహన పెంచుకుని సకాలంలో పన్నులు చెల్లించి దేశ, రాష్ట్ర పురోగతికి సహకరించాలన్నారు. ట్యాక్స్ ప్రాక్టీషనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, తిరుపతి అధ్యక్షుడు సునీల్ అహ్మద్, లోకల్ అధ్యక్షుడు మునికృష్ణయ్య, సీనియర్ ఆడిటర్ ఫల్గుణకుమార్, గల్లా ప్రవీణ్‌కుమార్, ఆడిటర్లు పాల్గొన్నారు.

ఖో-ఖో విజేతలుగా జోన్ 2ఉమెన్, 3మెన్ జట్లు



పరుగు పందెం, వాలీబాల్ ఆడుతున్న కలెక్టర్



బాస్కెట్‌బాల్ విజేత జోన్ 1 ఉమెన్ జట్టు - బాస్కెట్‌బాల్ విజేత జోన్ 1 మెన్ జట్టు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలు రెండో రోజైన సోమవారం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. సాయంత్రానికి ఖో-ఖోలో తుది ఫలితాలు వచ్చాయి. మెన్ విభాగంలో జోన్ 3 జట్టు, ఉమెన్ విభాగంలో జోన్ 2జట్టు విజేతలుగా నిలిచాయి. బాస్కెట్‌బాల్‌లో జోన్1 ఉమెన్, జోన్ 1మెన్ జట్లు గెలుపొందాయి. ఎస్వీయూ క్యాంపస్‌స్కూల్ మైదానంలో ఆర్చరీ, వాలీబాల్, ఎస్వీయూ గ్రౌండ్‌లో అథ్లెటిక్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఇండోర్‌హాల్లో బాక్సింగ్ పోటీలు, శ్రీనివాస క్రీడా సముదాయంలో కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. శాప్ ఛైర్మన్ రవినాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్ పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాకలక్ష్మి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, శాప్ డైరెక్టర్లు రజనీ, రవీంద్రనాథ్, సంతోషకుమార్, డీఎస్‌డీవోలు శశిధర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ విజేత జోన్ 2 మెన్ జట్టు, ఆర్చరి, బాక్సింగ్, కబడ్డీ

15 కేజీల గంజాయి స్వాధీనం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నై రహదారి సమీపంలో 15 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి 15 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలను మీడియా సమావేశంలో వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.

28న అథ్లెటిక్స్ జిల్లాస్థాయి పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని కేవీఎస్ మైదానంలో ఈనెల 28న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడిజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్‌రాజనందన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14, 16, 18, 20 విభాగంలో బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆరోజున ఉదయం 8గంటలకు ఆధార్, జనన ధృవీకరణ పత్రం జిరాక్సులతో తప్పనిసరిగా మైదానానికి చేరుకోవాలి. మరిన్ని వివరాల కోసం 86868 67079 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎంపీడీవో కార్యాలయం ఖాళీ

కానరాని అధికారులు, సిబ్బంది



సోమవారం ఉదయం సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

తడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించే ఎంపీడీవో కార్యాలయం అధికారులు, సిబ్బంది లేక బోసిపోతోంది. ఎంపీడీవో శిక్షణ నిమిత్తం బాపట్లకు వెళ్లగా, ఏవో సూళ్లూరుపేట ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఆరు నెలలుగా అక్కడే ఉన్నారు. ఇక ఈవోపీఆర్‌డీ అనారోగ్య కారణంతో దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ఇక కార్యాలయంలో ఉన్నది కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే. ఇలా అధికారులంతా దూరంగా ఉండటంతో ఎంపీడీవో కార్యాలయంలో ఎవరూ కానరావడంలేదు. ఈ పరిస్థితిని గుర్తించిన జిల్లా అధికారులు నాయుడుపేట ఎంపీడీవో సురేష్‌బాబును తడ ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన ఒక్కనాడైనా ఈ కార్యాలయ ముఖమే చూడలేదు. ఏవైనా ముఖ్యమైన ఫైళ్ల క్లియరెన్స్ అవసరమైతే ఇక్కడ పనిచేసే అటెండర్ నాయుడుపేటకు తీసుకువెళ్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తడ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులను, సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.

చిల్లకూరులో క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

చిల్లకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు పీహెచ్‌సీ వద్ద సోమవారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మహిళలకు, పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకు పాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సాలోమ్ అరాఫత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పింక్ బస్సులను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను నిర్వహిస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నాగరాజన్, లలిత్, తేజశ్వని, హరిత, పద్మావతి, సూపర్‌వైజర్ రవికుమార్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో ధర్నా



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

గూడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో వద్ద సోమవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్‌ఎంయూఏ నాయకుడు అహ్మద్ మాట్లాడుతూ అక్రమంగా సస్పెండ్ చేసిన కండక్టర్ శ్రావణ్‌కుమార్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. డిపో మేనేజర్ మొండి వైఖరి విడనాడాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జీఎస్ వాసులు, వెంకటేశ్వర్లు, శ్రీకళ, మస్తాన్, మల్లికార్జున, రాము, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

గూడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలయ్య కోరారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోలయ్య మాట్లాడుతూ మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన సుమిత్రమ్మ అనే వృద్ధురాలికి చెందిన ఇంటి స్థలంలోని హద్దురాళ్లను కొందరు తొలగించి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దీనిపై విచారణ నిర్వహించి వృద్ధురాలికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నవకోట, మమత, సుధాకర్‌రావు, సుమిత్రమ్మ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ సీనియర్ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు వైజేపీ లయన్స్‌క్లబ్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఆర్‌వీరావు, శ్రీనివాస్, గురునాథం, హరికృష్ణ, సుధీర్, డాక్టర్ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



పాలకవర్గం చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వాకాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వాకాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదట వాకాడు స్వర్ణముఖి బ్యారేజీ నుంచి ఏఎంసీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అశోకపిల్లర్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏఎంసీ ఛైర్మన్‌గా మర్రి ప్రమీల, వైస్ ఛైర్మన్‌గా దువ్వూరు మధుసూదనరెడ్డి, పాలకవర్గ సభ్యులు సిద్దప్పరెడ్డి పోలమ్మ, పంట్రాంగం వసంత్, బత్తిన ప్రమీల, చల్లా స్వాతి, మారంరెడ్డి జనార్ధన్‌రెడ్డి, వంకా శ్రీజ, బసవనూరు భాస్కర్, అయనబోకరి యామినీ, విన్నమాల మంజుల, కల్లూరు క్రాంతి, షేక్ మస్తాన్‌బాషా, దొడ్డగ వెంకటరమణ, యల్లబోతు రాజగోపాల్ రెడ్డి చేత ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, కోట మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో గణపర్తి కిషోర్‌నాయుడు, పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, షేక్ జలీల్ అహ్మద్, మధుయాదవ్, దారా సురేష్, రౌతు శివకుమార్, పామాంజి కృష్ణయ్య, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలి

కోట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో సుచేంద్రప్రసాద్ హెచ్చరించారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో కోట, విద్యానగర్, చిట్టేడు, కేశవరం గ్రామాల్లోని ఎరువుల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి రైతుకు అడిగిన వెంటనే ఎరువులను సరఫరా చేయాలన్నారు. ఎరువులు ఉండి కూడా స్టాక్ లేదని చెప్పకూడదని, అధిక ధరలకు విక్రయించినా, రైతులను ఇబ్బందులు పెట్టినా కేసులు నమోదు చేస్తామని ఏవో హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణదారులతో మాట్లాడుతున్న ఏవో సుచేంద్ర ప్రసాద్

ఆర్టీసీ బస్టాండ్‌లో సరుడు చోరీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లోని ఓ మహిళ సరుడు చోరీకి గురైనంది. బాధితురాలి కథనం మేరకు... పట్టణంలో నివాసం ఉంటున్న నాగభూషణమ్మ సోమవారం సూళ్లూరుపేట వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కే సమయంలో ఆమె మెడలో ఉన్న రెండు సవర్ల సరుడు ఎవరో అపహరించారు. బాధితురాలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పంటకాలువను పునరుద్ధరించండి

నాయుడుపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీఅనంతసాగరం చెరువులోకి వస్తున్న పంట కాలువను పునరుద్ధరించాలని ఆ ప్రాంత రైతులు తహసీల్దారు రాజేంద్రకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పెళ్లకూరు మండలం పెన్నేపల్లి గ్రామం నుంచి మంద బైలు ద్వారా లక్ష్మీఅనంతసాగరం చెరువులోకి వస్తున్న పంటకాలువను ఎన్‌హెచ్-71 రోడ్డు నిర్మించే సమయంలో పూడ్చివేయడంతో తీవ్ర నష్టపోతున్నామని రైతులు చెప్పారు.

చవితి వేడులకు సిద్ధమైన గణేశ్ విగ్రహాలు

గూడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చవితి పండుగకు వినాయక విగ్రహాలు సిద్ధం అయ్యాయి. తయారీదారులు వివిధ ఆకృతుల్లో, ప్రత్యేక వాహనాలపై కొలువుతీరినట్లు విఘ్నేశ్వరుడి ప్రతిమలను తీర్చిదిద్దుతున్నారు. స్థానిక కోర్టుసెంటర్ సమీపంలోని నాలుగు తయారీ కేంద్రాల్లో వెయ్యికి పైగా వినాయక విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాలను వాడవాడలా సందడిగా జరుపుకుంటుంటారు. నిర్వాహకులు పోటీపడి మరీ వివిధ రూపాల్లో విగ్రహాలను ఏర్పాటు చేస్తుంటారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాలను ఏర్పాటు చేసి 9వ రోజు వరకు విగ్రహాలకు పూజలు నిర్వహించి గ్రామోత్సవం జరిపి నిమజ్జనానికి తరలించి వేడుక చేసుకుంటారు. ఈ నేపథ్యంలో పట్టణంలో నాలుగు నెలల నుంచి కళాకారులు విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఒక అడుగు నుంచి 15 అడుగుల వరకు వివిధ ఆకృతుల్లో ప్రత్యేక ఆకర్షణ ఉండేలా విగ్రహాలను రూపొందిస్తున్నారు. విగ్రహాలు రూ.3 వేల నుంచి రూ.70 వేల వరకు విక్రయిస్తున్నట్లు తయారీదారులు చెబుతున్నారు. ఈ ఏడాది విగ్రహాల తయారీకి అవసరమైన ముడి సరకులు, కూలీల ఖర్చులు పెరగడంతో గతేడాదితో పోలిస్తే ఈసారి 20శాతం వరకు ఖర్చులు పెరిగిందని తయారీదారులు చెబుతున్నారు. గూడూరు పట్టణంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన ఉత్సవ నిర్వాహకులు తమకు నచ్చిన విగ్రహాలను ముందుగానే కొనుగోలు చేసేందుకు వస్తుండడంతో దుకాణల వద్ద పండుగ వాతావరణం సంతరించుకుంది.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యం: పాశిం



లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

గూడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు పారదర్శక పాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు సంబంధించిన ఆస్తుల పాస్‌పుస్తకాలు, రేషన్ కార్డులపైన సీఎం ఫొటోలు ముద్రించారని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డుల మీద ఎవరి ఫొటోలను వేయలేదని, రాజ్యాంగ బద్ధంగా పాలన సాగిస్తోందన్నారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తూ ముందుకు వెళుతోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు పెద్దపీట వేశారన్నారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ పేదలందరికీ రేషన్ సరుకులను పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల అందజేస్తోందని, దీనివల్ల అక్రమాలను అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు ప్రసాద్, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు శీలం కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, అబ్దుల్ రహీం, బిల్లు చెంచురామయ్య, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, భారతి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత: విజయశ్రీ

సూళ్లూరుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత కోసమే స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం సూళ్లూరుపేట పట్టణంలోని కోళ్లమిట్ట చౌకదుకాణంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఆర్డీవో కిరణ్మయి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ సరుకులను తీసుకోవడంలో లబ్ధిదారుల సమస్యలను గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులను రూపొందించి అందజేయడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం మాదిరిగా రేషన్ కార్డులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, సర్వే రాళ్లపైనా ఫొటోలు ముద్రించకుండా ప్రభుత్వం లోగోతో అందజేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే మహిళలకు ఉచిత సిలిండర్, బస్సు ప్రయాణం, తల్లికి వందనం లాంటి పథకాలు ప్రవేశపెట్టి మహిళా అభ్యున్నతికి పెద్దపీట వేసిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పినా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తూ బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, చిల్లర రాజకీయాలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, చిట్టేటి పెరుమాల్, మేడా సాయి, బీజేపీ నాయకురాలు బెజవాడ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఆర్డీవో కిరణ్మయి, టీడీపీ నాయకులు

కూటమితోనే సంక్షేమం, అభివృద్ధి



స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో సోమవారం మున్సిపల్ వైస్ ఛైర్మన్, టీడీపీ నాయకులు రఫీతో కలసి స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా పీడీకి సన్మానం



పెంచలయ్య సత్కరిస్తున్న మెప్మా సిబ్బంది

గూడూరు అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెప్మా సిటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న పెంచలయ్య పీడీగా పదోన్నతి పొందడంతో సోమవారం స్థానిక మెప్మా కార్యాలయంలో సిబ్బంది ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

భూములను మార్కెట్ యార్డుకు అప్పగించండి

సూళ్లూరుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామంలో సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు కేటాయించిన భూములను వెంటనే అప్పగించాలని సూళ్లూరుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, దొరవారిసత్రం మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసుల నాయుడు సోమవారం ఆర్డీవో కిరణ్మయిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏకొల్లు గ్రామ సర్వే నెంబరు 61-బి1లో 2.89 ఎకరాలు, సర్వే నెంబరు 61-2లో 0.11 సెంట్లు మొత్తం 3 ఎకరాలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు కేటాయించారని, ఆ భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించి అప్పగించాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

బాలాయపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సంగవరం, బాలాయపల్లి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తిరుపతి జిల్లా విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వ, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖాధికారి విజయలక్ష్మి, విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ జయరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

వెంకటగిరి టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఫెర్టిలైజర్స్ దుకాణ యజమానులు యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో సుజాత, సీఐ రమణ హెచ్చరించారు. సోమవారం వారు ఎరువుల దుకాణలను తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

కోలా ఆనంద్‌కు అభినందనలు

వెంకటగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమితులైన కోలా ఆనంద్‌కు వెంకటగిరి శ్రీకృష్ణ దేవరాయ కాపు, బలిజ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు. సోమవారం శ్రీకాళహస్తిలోని కోలా ఆనంద్ నివాసంలో ఆయనను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోట కృష్ణయ్యతో పాటు కాపు, బలిజ సంఘ నాయకులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

వెంకటగిరి టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మల్లమ్మ గుడి వీధిలోని ఎస్టీ కాలనీ వద్ద సోమవారం బాల్యవివాహాల నిర్మూలనపై న్యాయవాదులు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిచాఆరు. కార్యక్రమంలో గాంధీ, రెంటాల వాసు, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ



ప్రసాద్ నాయుడిని సత్కరిస్తున్న పునుగోటి విశ్వనాథం

బాలాయపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) బాలాయపల్లి గ్రామానికి చెందిన తాళ్లూరు ప్రసాద్ నాయుడు ఏఎంసీ డైరెక్టర్‌గా సోమవారం బాధ్యతల స్వీకరించారు. ఆయనను టీడీపీ నాయకులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటగిరి ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

సూళ్లూరుపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో నాగేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలి స్వీకారోత్సవం ఈవో మమత అధ్యక్షతన సోమవారం జరిగింది. ఛైర్మన్‌గా తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, సభ్యులుగా పట్టుపల్లి మోహన్, పోలూరు లీలా మోహన్, చిట్టేటి మధు, మాటిరెడ్డి బేబీ, వెంటక నాగ పరిమళ, మామండూరు శాంతి, పొల్లమాల సుమతి, పల్లేటి ఆనంద నాయుడుతో ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, బీజేపీ నాయకులు సురేంద్ర రెడ్డి, ఆరణి విజయ భాస్కర్ రెడ్డి, తన్నీరు శేషగిరిరావు, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, అలవల శ్రీనివాసులు పాల్గొన్నారు.



పాలక మండలి ఛైర్మన్, సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఈవో మమత, ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్సీ వాకాటి

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీపీ రాజశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి

దక్కిలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత కోసమే స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన తహసీల్దారు శ్రీనివాసులుతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందచేశారు. ఈ సదర్భంగా ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కార్డులు వల్ల రేషన్ సరుకులు పొందిన, తీసుకోని వారి వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో లోపాలను సరిదిద్దేందుకే స్మార్ట్ కార్డులు ఎంతగానో దోహదపడుతాయని చెప్పారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ 1నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులు ఏ రోజైనా రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, లింగసముద్రం సొసైటీ అధ్యక్షుడు రంగినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

తడ: మండలానికి ప్రభుత్వం సరఫరా చేసిన 14,221 స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దార్ శరత్‌బాబు రేషన్ డీలర్లకు అందజేశారు. సచివాలయాల సిబ్బంది, టీడీపీ నాయకులు, రేషన్ డీలర్లు సోమవారం నుంచి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేయడం ప్రారంభించారు.

బాలాయపల్లి: రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను సోమవారం తహసీల్దార్ విజయలక్ష్మి పంపిణీ చేశారు. మండలానికి 10,758 కార్డులు మంజూరు కాగా, మొదటిరోజు 768 కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలానికి ప్రభుత్వం సరఫరా చేసిన 14,221 స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దార్ హరికృష్ణ రేషన్ డీలర్లకు అందజేశారు. వాటిని సచివాలయాల సిబ్బంది, టీడీపీ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

కోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, టీడీపీ నాయకులు జలీల్ అహ్మద్, మధుయాదవ్, దారా సురేష్, తిరుమల శెట్టి కోటేశ్వరరావు, షంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


గురువులను గౌరవించాలి



ఉపాధ్యాయులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గురువులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పుతూ ప్రతినిత్యం ఒత్తిడిలో ఉండే ఉపాధ్యాయులకు ఆటవిడుపుగా ప్రగతి సేవాసంస్థ ముందుకు వచ్చి క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, కరిముల్లా, దశరధ రామిరెడ్డి, ఎన్‌వీరత్నం, పిశ్శెళ్ల శ్రీనివాసులు, పేటేటి ప్రకాశ్, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామాక్షమ్మ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ



హోమపూజల్లో భక్తులు

చిల్లకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారెడ్డిపాళెం గ్రామంలో నూతనంగా నిర్మించిన కామాక్షమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ముందుగా ఆలయంలో అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవాకిఇ విగ్రహానికి విశేష పూజులు జరిపి ప్రతిష్ఠించారు.

ఎంపీడీవో తీరుపై టీడీపీ విమర్శలు

పెళ్లకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు ఎంపీడీవో ప్రమీలారాణి నిర్ణయాలు సరికావని టీడీపీ నాయకులు విమర్శించారు. సోమవారం టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు, వేలూరు మురళీకృష్ణారెడ్డి, కందమూడి శివకుమార్, శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి తదితరులు ఎంపీడీవోతో సమావేశమయ్యారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయశ్రీకి, టీడీపీ నాయకులకు దూరం పెంచే ప్రయత్నం ఎంపీడీవో చేస్తున్నారని ఆరోపించారు.జీలపాటూరు సర్పంచు శివకుమార్ మాట్లాడుతూ మా పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం ఉపాధి హామీ నిధులు మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించామన్నారు. ఆ వినతిపత్రం కలెక్టరేట్ నుంచి డ్వామాకు అక్కడ నుంచి ఎంపీడీవో కార్యాలయానికి రాగా సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు లేవని ఎంపీడీవో తనకు లెటర్ రూపంలో ఇవ్వడం సరికాదన్నారు. తమ గ్రామాభివృద్ధిని ఎంపీడీవో అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, కాటూరు గోపాల్‌రెడ్డి, కలవకోలు మునీష్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.